
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 18 సెప్టెంబరు 2024 | 5






స్వచ్ఛతా హి సేవ మానవహారం.. పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

15 రోజుల పాటు స్వచ్ఛతా హి సేవ : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: జిల్లాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ పి . ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం వైజంక్షన్ వద్ద మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బాలరామకృష్ణ, కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు. తొలుతు వారంతా స్వచ్ఛతా హి సేవ పోస్టరు ఆవిష్కరించి బ్యానర్‌పై సంతకాలు చేశారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ 15 రోజుల పాటు కాలుష్య రహిత సమాజంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిద్దామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రధాని మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అమలు చేస్తున్నారన్నారు.




కలెక్టరేట్ చెంతనే ఉన్న డైట్ కళాశాల ప్రాంగణం

నాచు పట్టి ఉన్న సింక్

కలెక్టరమ్మా.. డైట్ చూడమ్మా!

- అధ్వానంగా డైట్ కళాశాల ప్రాంగణం
- కలెక్టరేట్ చెంతనే ఉన్నా ఇంతే
- సమస్యలతో సతమతం
- హాస్టళ్లలో 150 మంది విద్యార్థులు
- రాత్రి వేళ పాముల సంచారం
- వాచ్‌మెన్ లేక భయం..భయం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 17 : జిల్లా సమస్యలన్నీ పరిష్కరించేది అక్కడే..అయితే ఆ చెంతనే సమస్య ఉన్నా ఎవరూ కన్నెత్తి చూడడం లేదు.. విద్యార్థులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడంలేదు. ఇదీ కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న బొమ్మూరు డైట్ కళాశాల ప్రాంగణం దుస్థితి. ఆ కళాశాల వసతిగృహాలు చాలా అధ్వానంగా ఉన్నాయి. డైట్ కళాశాల ప్రాంగణంలో ఉన్న రెండు వసతి గృహాల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. వసతిగృహాల్లో సుమారు 150 మంది విద్యార్థిని విద్యార్థులు ఉంటున్నారు. వసతిగృహాల పరిస్థితి చూస్తే ముక్కుమూసుకోవడం తప్పని సరి. పాడుబడ్డ భవనంలో పరిశుభ్రత లేని పరిస్థితిలో వసతి గృహాల గదులు కంపుకొడుతున్నాయి. విద్యార్థులు భోజనాలు చేసే మెస్ రూమ్, దానికి అనుకుని ఉన్న డ్రైనేజీ అధ్వానంగా ఉంది. ప్రాంగణంలోకి పందులు సంచారం విపరీతంగా ఉంది. విద్యార్థులు వినియోగించే సింక్ నాచుపట్టి దుర్వాసన వస్తోంది. వసతి గృహాల ప్రాంగణం పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిపోయింది.రాత్రివేళ కిటికీల గుండా పాములు, పురుగులు వంటివి లోపలకు ప్రవేశిస్తుండడంతో విద్యార్థులు భయపడుతున్నారు.బాత్‌రూమ్‌లు డోర్లు ఊడిపోయి, గోడలు పెచ్చుపెచ్చులుగా ఊడి నివాసయోగ్యంగా లేవు.విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బాలికల,బాలుర హాస్టళ్ల మధ్య రక్షణ గోడ లేదు..

డైట్ కళాశాల ప్రాంగణంలో ఉన్న బాలబాలికల వసతి గృహాల మధ్య రక్షణ గోడ లేదు. కనీసం అక్కడ వాచ్‌మెన్ కనిపించడంలేదు. బాలికల వసతి గృహానికి మహిళా అధ్యాపకురాలు, బాలుర వసతి గృహానికి అధ్యాపకుడు ఇంచార్జీలుగా ఉన్నారు. వారి పర్యవేక్షణ తీరు ఎలా ఉందో వసతి గృహాలను చూస్తే అర్థమవుతుంది. కౌమార దశలో ఉన్న బాలబాలికల పట్ల కనీస జాగ్రత్త చర్యలు కానరావడంలేదు. రెండు వసతి గృహాల మధ్య కట్టుదిట్టమైన చర్యలు లేవు. వసతి గృహాల్లో పరిస్థితులు విద్యార్థినీ, విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నించేలా ఉన్నాయి. వసతి గృహాలకు ప్రత్యేకంగా వార్డెన్లను నియమించుకోవాల్సి ఉంది. కాని ఇక్కడ అధ్యాపకులకే ఆ బాధ్యతలు అప్పగించడంతో వారు టీచింగ్‌తో పాటు వసతి గృహ నిర్వహణ చేయలేకపోతున్నారనేది కనిపిస్తోంది. ఒక్కో విద్యార్థి నుంచి మెస్‌కు నెలకి రూ.2 వేలు.. ఏడాదికి వసతికి రూ.4 వేలు కట్టించుకుంటున్నా కనీస సంరక్షణ చర్యల్లేవ్..దీంతో విద్యార్థులు లబోదిబోమంటున్నారు. వసతి గృహాలపై కనీస పర్యవేక్షణ లేకపోవడం..ఎవరుపడితే వారు డైట్ ప్రాంగణంలోకి వచ్చి వెళ్లడంతో పరిస్థితి దారుణంగా ఉంది. అక్కడ లోపలికి వెళ్లే వారిని ఆపి ప్రశ్నించేవారే లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా ఉన్నతాధికా రులు దృష్టి సారించాల్సి ఉంది.


డైట్ కళాశాల ఆవరణలో నెలకొన్న అపారిశుధ్యం

హైవే దాటిన చిరుత పులి | 7 | పడాల వీరభద్రరావు ఇకలేరు



మందుబాబులకు.. పండగే!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కొత్త మద్యం పాలసీని కూటమి ప్రభుత్వం నేడో రేపో ప్రకటించే అవకాశం ఉంది. ప్రధానంగా జగన్ పిచ్చి బ్రాం డ్లను నిర్మూలించనుంది.దీంతో ఐదేళ్ల పాటు నాసిరకం మద్యంతో విసిగిపోయిన మందుబాబుల గొంతులో నాణ్యమైన చుక్క పడనుంది. ఇప్పటికే జగన్ పిచ్చి బ్రాండ్ల తయారీకి అడ్డుకట్ట వేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తమిళనాడు, కర్నాటక,కేరళ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని మద్యం పాలసీపై ఉన్నతా ధికారులతో అధ్యయనం చేయించారు. క్రోడీకరించిన ఈ నివేదికలను వారం కిందట కేబినెట్ సబ్ కమిటీ పరిశీలన చేసింది. మళ్లీ మంగళవారం మరోమారు చర్చించింది. వీరు నివేదిం చిన సిఫారసులపై బుధవారం నిర్వహించే మంత్రి మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కొత్త మద్యం పాలసీపై చర్చించి నివేదిక సమర్పించనున్నారు. మం త్రి వర్గ ఉప సంఘం గతంలో టీడీపీ ప్రభుత్వంలో మాదిరి పాలసీనే సిఫారసు చేసే అవకాశం కనిపిస్తోంది. అందుబాటు ధరల్లోనే మంచి బ్రాండ్ల ధరలు ఉండనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగా ప్రైవేటు షాపులు రానున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మద్యం షాపుల స్వరూపం, ధరలు పూర్తిగా మారిపోనున్నాయి.

- నేడో రేపో కొత్త మద్యం పాలసీ
- ప్రైవేటు షాపులకే కూటమి సై!
- ధరలపై ఎంఎన్‌సీలతో ఒప్పందం
- అందుబాటులో నాణ్యమైన కిక్
- క్వార్టర్ రూ.180.. నైన్టీ రూ.100
- జగన్ పిచ్చి బ్రాండ్లకు స్వస్తి
- నేడు కేబినెట్‌లో నిర్ణయం

అందుబాటులోకి నాణ్యమైన కిక్..

వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు నిర్ణయించి, ఆ నాయకులు ఆక్రమించుకున్న డిస్టలరీల్లో తయారు చేసిన నాసిరకం మద్యాన్ని ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా విక్రయించారు. బెల్టు షాపులకూ అక్కడి నుంచే సరఫరా జరిగేది. ఈ దాష్టీకానికి తూర్పు గోదావరిలో కనీసం వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మద్యం పాలసీ మార్పును కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొంది.దీంతో ప్రైవేటు షాపులు, పాత మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. పర్మిట్ రూంలను మంజూరు చేస్తారని సమాచారం. నాణ్యమైన సరుకును అందుబాటు ధరల్లో అందించే క్రమంలోనే సెబ్‌ని రద్దు చేసి అబ్కారీకి మళ్లీ అధికారాలను ప్రభుత్వం ఇచ్చింది. జగన్ జమానాలో ఎక్సయిజ్‌ను నిర్వీర్యం చేయడంతో మద్యాన్ని ఎవరి ఇష్టానుసారం వాళ్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. మళ్లీ టీడీపీ పాలసీ పట్టాలెక్కుతుండడంతో ఐదేళ్ల తర్వాత నాణ్యమైన చుక్క మందుబాబుల గొంతుతడపనుంది.

ప్రైవేటు షాపులకే

కూటమి ప్రభుత్వం ప్రైవేటు షాపులకే మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈ నెల 19 లేదా 20న నోటిఫికేషన్ ఇచ్చి 25-27వ తేదీకి ప్రక్రియ పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది. అంతా అనుకు న్నట్టు జరిగితే వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నాణ్యమైన సరుకు అందుబాటు ధరలో మందుబాబులో గొంతులో పడ నుంది. ఇప్పటికే గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న ప్రైవేటు షాపులపై ఓ నివేదికను ఎక్సైజు శాఖ పది రోజుల కిందట సమర్పించింది. దీని ప్రకారం అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 165 ప్రైవేటు షాపులు ఉన్నాయి. కానీ జగన్ ప్రభుత్వం తాగుడు తగ్గిస్తామని చెప్పి షాపుల సంఖ్యను విపరీతంగా పెంచింది. ఒక్క తూర్పుగోదావరిలోనే బార్లతో కలిపి 150కి పైగా మద్యం దుకాణాలకు అనుమతిచ్చింది. దరఖాస్తు ఫీజును తెలంగాణ మాదిరిగా రూ.2 లక్షలు నిర్ణయిస్తారని సమాచారం. ప్రభుత్వ ప్రారంభ ధరగా నగర పంచాయతీల్లో రూ.15 లక్షలు, మునిసి పాలిటీలో రూ.35 లక్షలు, నగరపాలక సంస్థ పరిధిలో రూ.50 లక్షలు నిర్ణయించే అవకాశం ఉంది. ఆన్‌లైన్ లాటరీ పద్ధతిలో ప్రైవేటు షాపులు కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. కల్లుగీత కార్మికులకు షాపుల్లో 10 శాతం కేటాయిస్తారని చెబుతున్నారు.

బోరుమంటున్న బార్ల యజమానులు

జగన్ జమానాలో బార్లలో ధరలు భయపెట్టేవి. టీడీపీ హయాంలో ఎంఆర్పీకే బార్లకు సరఫరా చేసి దానిపై వ్యాపారులకు 15-18% కమిషన్ ఇచ్చేవాళ్లు. పెద్ద బార్లలో మినహా ప్రైవేటు షాపుల్లో ఒక్క రూపాయి అదనంగా తీసుకునే వీలుండేది కాదు. కానీ జగన్ మాత్రం బార్లలో ధరలు ఇష్టానుసారం నిర్ణయించుకోవచ్చని ఆదేశాలిచ్చారు. వాళ్లకు ఇచ్చే కమిషన్ ఎత్తేశారు. దీంతో బార్లలో ధరలు బెదర గొట్టేవి.కొత్త మద్యం పాలసీ నేపథ్యంలో తాము నష్టపోతామని ప్రస్తుతం ఇంకా ఏడాది అనుమతులు ఉన్న బార్‌ల యజమానులు గగ్గోలు పెడుతున్నారు.కొంత మంది మూసివేస్తున్నారు. అబ్కారీ కమిషన్‌కు ఇటీవల విజయవాడలో జరిగిన సమా వేశంలో బార్ల యజమానులు కొన్ని విన్నపాలు చేశారు. బార్ల లైసెన్సు వచ్చే ఏడాది సెప్టెంబరు వరకూ ఉంది. కాబట్టి ఇప్పుడు రేట్లు తగ్గించి విక్రయించాలంటే తాము నష్టపోతా మని పేర్కొన్నారు. ప్రైవేటు షాపులు ఇస్తే వాటి మాదిరిగానే తమకు కమిషన్ ఇవ్వడంతో పాటు ఓ ఏడాది పాటు 10% అదనంగా ఇవ్వాలని, కొత్తగా ఇచ్చే ప్రైవేటు షాపులకు పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వొద్దని పేర్కొన్నారు. బార్లకు 100 మీటర్ల దూరంలో ఎలాంటి ప్రైవేటు షాపునకూ అనుమతి ఇవ్వరాదని అభ్యర్థించారు.షాపులను తెరిచి, మూసే సమయాల్లో తమకు ప్రైవేటు షాపులకు వ్యత్యాసం ఉండాలని కోరారు. వీటన్నిపైనా క్యాబినెట్ సబ్ కమిటీ చర్చించింది. ముందు జాగ్రత్తలో భాగంగా ప్రస్తుతం బార్‌లలో ఉన్న స్టాకును విక్రయించడంపై యజమానులు దృష్టి సారించారు. ఎందుకంటే కొత్తగా వచ్చే ప్రైవేటు షాపుల్లో రూ.180కే నాణ్య మైన క్వార్టరు దొరుకుతుంది. ప్రస్తుతం అదే మాదిరి క్వార్ట రుకు ఈ బార్లలో రూ.300 చెల్లించాల్సి వస్తోంది.

క్వార్టరు రూ.180

ఇప్పటికే పలు కంపెనీలతో బ్రాండ్ల ధరల విషయంలో ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. వీటికి లేబుల్ రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉంది. యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్, ఖాసా డిస్టిలరీస్ కంపెనీ, పీరి డిస్టిలరీస్ లిమిటెడ్ కంపెనీలతో 2024-25 ఏడాదికి మద్యం ధరలను అంగీకరిస్తూ గత నెల 29న ఉత్తర్వులు ఇచ్చారు. దీని ప్రకారం.. ప్రీమియం బ్రాండ్ల ధరల్లో పెద్ద మార్పు లేకపోయినా ఎక్కువగా విక్రయం జరిగే మీడియం రేంజ్ బ్రాండ్ల ధరలు ఓ కొలిక్కి వచ్చాయి. జగన్ దెబ్బకు ఎంసీ, సీయాగ్రామ్స్ వంటి బ్రాండ్లు రాష్ట్రం నుంచి పారిపో యాయి. ఐదేళ్లూ అందుబాటులో లేవు. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన బ్రాండ్లు మందుబాబులకు అందుబాటులోకి రానున్నాయి. దీని ప్రకారం.. ఎంసీ లక్సరీ సుప్రీం విస్కీ, మాస్టర్ బ్లెండర్ సిగ్నేచర్ ప్రీమియం అల్ట్రా రిజర్వు విస్కీ రూ.180, రాయల్ ఛాలెంజ్ సెలక్ట్ గోల్డ్ విస్కీ రూ.230, యాంటిక్విటీ బ్లూ అల్ట్రా గోల్డ్ విస్కీ రూ.400, ఆర్‌సీ అమెరికన్ ప్రైమ్ లగ్జరీ గోల్డ్ విస్కీ రూ.310, బ్లాక్ అండ్ అండ్ వైట్ స్కార్చ్ రూ.610, స్మిర్న్‌ఆఫ్ ట్రిపుల్ డిస్టిల్డ్ వోడ్కా రూ.280కే క్వార్టరు ధరగా ప్రభుత్వం ఆయా కంపెనీలో అంగీకారం కుదుర్చుకొంది. మల్టీ నేషనల్ కంపెనీలు తయారు చేసే ఈ బ్రాండ్లు ఐదేళ్ల నుంచీ రాష్ట్రంలో అడుగు పెట్టలేదు. ఎంసీ విస్కీకి ఏ మాత్రమూ సరితూగని లోకల్ బ్రాండ్లను జగన్ రూ.230కి అమ్మించారు. బార్‌లో అయితే రూ.300 కట్టాల్సి వచ్చేది. ఐదేళ్ల పాటు రాష్ట్రంలో కనుమరుగైన నాకవుట్, ఖజురహో, బడ్వయిజర్ తది తర బీర్లు షాపుల్లోకి రానున్నాయి. ఇప్పటికే ఎలిఫెంట్ బీరు అందుబాటులోకి వచ్చిం ది.గత టీడీపీ ప్రభుత్వంలో సారాను నిర్మూలించడానికి చంద్ర బాబు నాణ్యమైన చీప్ లిక్కరును రూ.50కే అందుబాటులోకి తెచ్చారు. తర్వాత దాని ధర రూ.60 అయ్యింది. ఇప్పుడు ఇది రూ.80-100 మధ్య ఉండొచ్చని చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఫలానా పిచ్చి బ్రాండ్లు మాత్ర మే దుకాణాలకు పంపాలంటూ అధికారులపై ఒత్తిడి చేసే విధానాన్ని ఇప్పటికే కూటమి ప్రభుత్వం తీసే సింది. కమిషనరేట్ స్థాయిలో పర్చేజ్ ఆర్డరు ప్రకారం కొనుగోలు చేసి డిపోలకు పంపించే బ్రాండ్లను సమానంగా అన్ని దుకాణాలకు ఇవ్వాలని ఆదేశాలిచ్చింది.

నిడదవోలులో మూడు బార్లకు రెండు మూత



నిడదవోలు, సెప్టెంబరు 17 : మద్యం వ్యాపారం అంటే నష్టాలు వచ్చినట్టు ఎక్కడా లేదు. జగన్ ప్రభుత్వంలో మద్యం వ్యాపారమూ నష్టాలను చవిచూసింది. మూడు గ్లాసులు, ఆరు పెగ్గులుగా కళకళలాడాల్సిన బార్లు మూతపడ్డాయి. నిడదవోలు పట్టణ పరిధిలో 2021-22 సంవత్సరంలో మూడు బార్లకు గత జగన్ ప్రభుత్వం అనుమతు లిచ్చింది. లక్షల రూపాయిలు వెచ్చించి బార్లను వేలంపాటలో పాడుకున్నారు.అయితే బార్లు ప్రారంభం అయ్యాక నాణ్యమైన మద్యం అందుబాటులో లేకపోవడంతో బార్లు నష్టాల బాటలో నడిచాయి. గత తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.150లు విలువ కలిగిన క్వార్టర్ బాటిల్ జగన్ ప్రభుత్వంలో రూ.240లకు ధర పెరగడంతో మందుబాబులు నిరాశ వ్యక్తం చేసేవారు.దీంతో బార్లు పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయాయి. ఈ నేపథ్యంలో నిడదవోలు పట్టణంలో ఉన్న మూడు బార్లలోను రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న డీటీఎస్‌వీ బార్, యర్నగూడెం రోడ్డులో ఉన్న ఎస్ఎస్ గ్లాస్‌మెట్స్ బార్లు ఈ నెల ఒకటో తేదీ నుంచి మూసివేశారు. ఒక్కోబార్ సుమారుగా రూ.75 లక్షలకు వేలం పాటలో పాడుకోగా ఇప్పుడు రూ.80 లక్షలకు చేరుకుంది. గత రెండేళ్లుగా నష్టం రావడంతో మూడో ఏడాది భరించలేక బార్ యజమానులు తమ లైసెన్స్‌లను రద్దు చేసుకున్నారు.

వంట నూనెల ధరలు పెరగలేదు
వ్యాపారుల మోసం.. విజిలెన్స్ దాడులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వంటనూనెలపై కస్టమ్స్ సుంకం పెంచే అవకాశం ఉందనే పుకార్లతో ఇటీవల పామాయిల్, సన్‌ఫ్లవర్ ధరలు దారుణంగా పెంచి వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యాపారులు నూనెలపై రూ.20 నుంచి రూ.30 వరకూ పెంచేశారు. సన్ ఫ్లవర్ ప్యాకెట్ రూ.110 నుంచి రూ.115కి అమ్మే వారు. ఇవాళ రూ.135కు అమ్ముతున్నారు. రైస్ బ్రాన్ ఆయిల్ రూ.100 వరకూ ఉండేది.రూ.130కి అమ్ముతున్నారు. పామాయిల్ రూ.110కి అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అక్రమ ధరలపై ఆగ్రహం వ్యక్తం చేసింది.విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాడులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా కాకినాడ జిల్లాలో తనిఖీ లు చేసి 9 కేసులు నమోదు చేశారు.

రైతులకు రుణాలు ఇవ్వండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ , సెప్టెంబరు 17 : జిల్లాలో వరదలు, భారీ వర్షాల నేపథ్యంలో రెండు నెలల్లో 279.72 కి.మీ ఆర్‌అండ్‌బీ రహదారులు, 203.53 కి.మీ పంచాయతీ రాజ్ రహదారులు దెబ్బతిన్నాయని, 94 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు ముంపుబారిన పడ్డాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. జూలై నెలలో ఎర్రకాలువ గోదావరి వరదలు వచ్చి గోపాలపురం,నిడదవోలు నియోజకవర్గాల్లో 10వేల ఎకరాలు ముంపుబారిన పడ్డాయన్నారు.సెప్టెంబరులో వరదలకు ఎర్రకాలువ దిగువ ప్రాంతానికి చెందిన 2,446 ఎకరాలు ముంపునకు గురైందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా చెల్లింపులు ,తిరిగి రుణాలు మంజూరు విషయంలో బ్యాంకర్ల ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆర్ఎం విశ్వేశ్వరరావు, డీసీసీ కన్వీనర్ ఎల్‌డీఎం ప్రసాద్, వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత ఇసుక పాలసీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: ఉచిత ఇసుక పాలసీ ఈ నెల 19 నుంచి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో డివిజన్, మండల స్థాయి అధికారులతో ఉచిత ఇసుక పాలసీపై మంగళవారం జేసీ చిన్నరాముడుతో కలిసి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మెట్రిక్ టన్నుకు రూ.362లుగా నిర్ణయించినట్టు తెలిపారు.ఆన్‌లైన్ ద్వారా మాత్రమే లావాదేవీలు నిర్వహిస్తారు. సమావేశంలో ఇన్‌చార్జి ఆర్‌డీవో కేఎల్.శివజ్యోతి, ఆర్‌వీ.కృష్ణనాయక్, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్‌టీవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గోదారిలో దాహం..దాహం!


రాజమహేంద్రవరం ప్రధాన మంచినీటి విభాగంలో ప్యూరిఫై కాక ముందు గోదావరిలో వరద నీరు ఇలా..


ప్లాంట్‌లో ప్యూరిఫై చేసిన తరువాత ఇలా..

గోదావరి చెంతనే ఉన్నా.. రాజమహేంద్రవరం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.. కళ్లెదుటే లక్షలాది క్యూసెక్కులు వృథాగా పోతున్నా ఒడిసి పట్టుకోలేక పోతున్నారు.. సాధారణ రోజుల్లో కాస్త ఫరవాలేదనిపించినా.. వరదల సమయంలో అయితే చుక్కనీరు రావడం గగనమే.. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఒక పూట మాత్రమే మంచినీటిని సరఫరా చేస్తున్నారు.. అదీ అరగంట మాత్రమే. అసలు ఎందుకిలా అని ఆరాతీస్తే.. అసలు సమస్య బయటపడింది.. గత పాలకుల నిర్లక్ష్యం.. నేడు ప్రజలకు శాపంగా పరిణమించింది.. గొంతులు తడిపేందుకు అడ్డంకిగా మారింది.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సమస్య పరిష్కారానికి పూనుకోవడంతో అసలు విషయం బయటపడింది. నగరంలో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక కథనం.

గోదావరి చెంతనే.. గొంతులు ఎండుతున్నాయ్..

- రాజమహేంద్రవరంలో తాగునీటి ఎద్దడి
- ప్రధాన మంచినీటి విభాగంలో లోపాలు
- పాత మోటార్లతో కుస్తీ.. మరమ్మతులు
- మరో వైపు సిబ్బంది కొరత
- 4.5 లక్షల మందికి ఒక పూటే సరఫరా
- రెండుపూటలా నీరందించేలా కసరత్తు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17 : అఖండగోదావరి చెంతనే ఉన్నా గొంతులు ఎండుతున్నాయ్.. దశాబ్దాలుగా రాజమహేంద్రవరాన్ని తాగునీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి.ప్రతి ఏటా రాజమహేంద్రవరంలో తాగునీటి ఎద్దడి అధికమవుతూనే ఉంది. సాధారణ రోజుల్లో ఎంతో కొంత నీరందించగలుగుతున్నప్పటికి వరదల సమయంలో తాగునీటి కష్టాలు తప్పడంలేదు. నగరంలో 4.5 లక్షల మంది జనాభా ఉన్నారు. దాదాపు ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయి. అక్కడక్కడా పబ్లిక్ ట్యాప్‌లు ఉన్నాయి. ప్రజలు కార్పొరేషన్ వాటర్‌నే ఎక్కువ వినియోగిస్తారు. కళ్లెదుటే లక్షలాది క్యూసెక్కుల వరద నీరు సముద్రంలోకి పోతూనే ఉంటుంది. అయినా ప్రజల దాహం కేకలు మాత్రం ఆగడంలేదు. గత ఐదేళ్లుగా రాజమహేంద్రవరంలో తాగునీటి సమస్య పెరిగింది.

మరమ్మతులకు గురవుతున్న మోటార్లు..

నీటి శుద్ధి నిరంతరం జరగాలంటే మోటార్లు కండీషన్‌లో ఉండాలి. అయితే ప్రధాన మంచినీటి విభాగంలో మోటార్లు కండీషన్‌లో లేవు. ఐదేళ్లు, పదేళ్ల కిందట కొనుగోలు చేసిన 45 హెచ్‌పీ మోటర్లు రెండు, 50 హెచ్‌పీ మోటార్లు రెండు, 100 హెచ్‌పీ మోటార్లు మూడు, 60 హెచ్‌పీ మోటర్లు రెండు, 75 హెచ్‌పీ మోటారు 1 ఉన్నాయి. ఇవి నిరంతరం పనిచేస్తూనే ఉండడంతో మరమ్మతులకు గురవుతున్నాయి.వాటిని మరమ్మతుల నిమిత్తం ఆయా కంపెనీలకు పంపించి బిల్లు చెల్లించేసరికి పుణ్యకాలం అయిపోతుంది.పాత మోటార్లనే మరమ్మతులు చేయించుకుంటూ కాలంగడుపుతున్నారు. 52 మంది సిబ్బంది అవసరం ఉండగా 28 మంది మాత్రమే పని చేస్తున్నారు. నగరపాలక సంస్థకు వస్తున్న కమిషనర్లు తాగునీటి వ్యవస్థలో లోపాలపై దృష్టిపెట్టడంలేదు.

నేటికీ బ్రిటిష్ కాలం విధానమే..

నేటికీ బ్రిటీష్ కాలం విధానంలోనే ప్రధాన మంచినీటి విభాగంలో నీటిని ప్యూరిఫై చేస్తున్నారు. నూతన టెక్నాలజీ వైపు అడుగులు వేయడంలేదు.దీంతో గోదావరి వరదల సమయంలో నీటి పంపింగ్‌కు పడే బాధలు వర్ణణాతీతం. ప్రధాన మంచినీటి విభాగంలో రావాటర్‌ను లిఫ్ట్ చేశా క క్లారిఫైడ్ బ్రిడ్జిలోకి చేరుస్తారు. అక్కడ బురద ,మట్టి వేరుచేసి అక్కడ నుంచి ఫిల్టర్ బెడ్‌లోకి నీరు చేరుతుంది.ఫిల్టర్ బెడ్‌లో 70-03 ఎంఎం మెత్తని ఇసుక 600 ఎంఎం మందం, 5.3 ఎంఎం గండ్ర ఇసుక 100 ఎంఎం మందం, 12-5 ఎంఎం గులకరాళ్లు 100 మందం, 20-12 ఎంఎం గులకరాళ్లు 100 మందం, 40-20 ఎంఎం గులకరాళ్లు 150 మందం, 60-40 ఎంఎం గులకరాళ్లు 150 మందంలో నీరు ఫిల్టర్ చేస్తారు. ఈ ప్రోసెస్‌లోనే వాటర్‌ను ల్యాబ్‌లో టెస్ట్ చేసి అమోదయోగ్యమైన తాగునీటిను బయటకు విడుదల చేస్తారు. ప్రతి 72 గంటలకు 54 ఎంఎల్‌డీ వాటర్‌ను తయారు చేస్తారు. నగరంలో ప్రధాన మంచినీటి విభాగంతో పాటు ఉన్న రెండు 10 ఎంఎల్‌డీ ప్లాంట్ల ద్వారా వచ్చే నీరు కూడా శుద్ధి చేసి సరఫరా చేస్తారు. మొత్తం 74 ఎంఎల్‌డీ వాటర్‌ను నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి విభాగం శుద్ధి చేసి పైప్‌లైన్ల ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులకు సరఫరా చేస్తారు. అక్కడ నుంచి నేరుగా ప్రజలకు సరఫరా అవుతాయి.



మరమ్మతులకు గురవుతున్న మోటార్లు..

రాజమహేంద్రవరంలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన మంచినిటి విభాగాన్ని గత వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. నగరపాలక సంస్థ నిధులను బ్యూటిఫికేషన్ పేరుతో దారిమళ్లించి వృథా చేశారు. తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంవిమర్శలకు దారితీసింది. ప్రధాన మంచినీటి విభాగంలో వాటర్ పంపింగ్‌కు అవసరమైన అత్యాధునిక మోటార్లు కొనుగోలు చేయలేకపోయారు.

పుష్కరం తర్వాత మంచినీటి విభాగంపై దృష్టి

రాజమహేంద్రవరంలో ప్రధాన మంచినీటి విభాగంపై 12 ఏళ్ల తర్వాత ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నేరుగా ప్రధాన మంచినీటి విభాగం సమస్యలను తెలుసుకుని తాగునీరు శుద్ధి చేసే ప్రాంతంలోనే సమీక్షించారు. ప్రధాన మంచినీటి విభాగానికి అవసరమైన మూడు ఎర్తికల్ టర్బైయిన్ మోటార్ల కొనుగోలుకు ప్రతిపాదనలు చేశారు. రూ.75 లక్షలతో ముందుగా ఒక మోటారు చెన్నై నుంచి తీసుకొస్తున్నారు. మిగిలిన రెండు మోటార్లను శాంక్షన్ తీసుకున్నాక తీసుకువస్తారు. ఈ మోటార్లు అమర్చడం ద్వారా నగరంలో తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కరించవచ్చు.రాజమహేంద్రవరం ప్రజలకు రెండుపూటల తాగునీరు సరఫరా చేసేవిధంగా కసరత్తు చేస్తున్నారు.



సహజ పచ్చదనం కనిపించేలా ఏర్పాటుచేసిన ట్రాప్ బోను

హైవే దాటిన చిరుత పులి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 17: దివాన్‌చెరువు అటవీ ప్రాంతం మధ్యలో సోమవారం రాత్రి సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో చిరుత పులి మహా పుష్కర వనం వైపు నుంచి రిజర్వ్ ఫారెస్టు వైపు రోడ్డు దాటుతుండగా హైవేపై వెళ్లే వారు గమనించారని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖాధికారి ఎస్.భరణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాలాచెరువు నుంచి ఆటోనగర్ హైవేపై ఇరువైపులా ప్రయాణించే వాహనచోదకులు గమనిస్తూ ప్రయాణించాలని కోరారు. సీసీ, ట్రాప్ కెమెరాల్లో మంగళవారం చిరుత పులి కదలికలు కనిపించలేదన్నారు. అదనపు బోనులు అమర్చి చిరుత పులిని పట్టుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. నివాస ప్రాంతాల్లో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణ కాలేదన్నారు. ప్రస్తుతం మూసి ఉన్న పుష్కర వనాన్ని చిరుత సంచారం నేపథ్యంలో మరికొన్ని రోజులు మూసి ఉంచనున్నట్టు డీఎఫ్‌వో చెప్పారు.



గణనాథునికి మహా నైవేద్యం

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మెరక వీధిలోని వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన గణనాథునికి భక్తులు మంగళవారం భారీ నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో 11వ రోజున లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. 108 రకాల స్వీట్లు, పిండి వంటలను నైవేద్యం పెట్టారు. ఈ నెల 23న స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం, అన్నదానం, గణపతి శోభాయాత్ర జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

- కొవ్వూరు

పెద్దాపురం 'నవోదయ'లో ప్రవేశానికి
ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పెంపు

పెద్దాపురం, సెప్టెంబరు 17: జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పెంచినట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ వరకు గడువు పెంచామని తెలిపారు. వచ్చే సంవత్సరం జనవరి 18న ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో
రేపటి నుంచి అండర్-19 ఆటల పోటీలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆటల ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి అండర్-19 ఆటల పోటీలను గురువారం నుంచి నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా అధ్యక్షుడు, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి జేవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు, ఆర్‌ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. 2006 జనవరి 1 తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు కార్యదర్శి శివరామకృష్ణను 9848176986 నెంబరులో సంప్రదించాలని సూచించారు. షెడ్యూల్ ఇలా... 19న రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాస్కెట్ బాల్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, కరాటే, టేబుల్ టెన్నిస్ (కన్వీనరు మొబైల్: 9490300105), కాకినాడ డీఎస్ఏ మైదానంలో 21న ఫుట్‌బాల్, జూడో, స్విమ్మింగ్, తైక్వాండో, యోగా, రెజ్లింగ్, 29న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, వచ్చే నెల 1న ఖోఖో, హాకీ, ఫెన్సింగ్, రైఫిల్ షూటింగ్, సాఫ్ట్ టెన్నిస్, 30న పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్చరీ, రగ్బీ (కాంటాక్ట్ మొబైల్: 9866311539), వచ్చే నెల 16న మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెన్నికాయిట్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, నెట్‌బాల్ (కాంటాక్ట్ మొబైల్: 8142810810), 19న జి.మామిడాడలోని ఫ్యామిలీ క్లబ్‌లో వాలీబాల్, కబడ్డీ, చెస్ (కాంటాక్ట్ మొబైల్: 9866400999), 30న కాకినాడలోని పీఆర్ డిగ్రీ కళాశాల, ఆర్ఎంసీ మైదానాల్లో అథ్లెటిక్స్, క్రికెట్, లాన్ టెన్నిస్, హ్యాండ్‌బాల్ (కాంటాక్ట్ మొబైల్: 9866311539) పోటీలు జరుగుతాయి.

ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 4వ విడత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 17: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐలు, కాకినాడ, జగ్గంపేట ప్రైవేట్ ఐటీఐల్లో 2024-25 సంవత్సరానికి మిగిలిన సీట్లలో ప్రవేశానికి నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాలశర్మ తెలిపారు. ఐటీ ఐ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీ రాత్రి 11.59 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ సెంటర్లో అభ్యర్థి ఏ ఐటీఐలో చేరదలిచాడో ఆ ఐటీఐలను తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంపిక చేసుకోవాలి. మొదటి, రెండు, మూడవ విడతల్లో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా నాల్గవ విడత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులంతా దగ్గర్లో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటీ ఐల్లో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవ్ చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 0884-2348182, 9701215511 నెంబర్లలో సంప్రదించాలి.

నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో
మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు

అన్నవరం, సెప్టెంబరు 17: అన్నవరం దేవస్థానం దత్తత దేవాలయమైన కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సుమారు రూ.16 లక్షల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో మరో ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఈవో రామచంద్రమోహన్ ఇప్పటికే ముగ్గురిని సస్పెండ్ చేసి ఇద్దరికి షోకాజు నోటీసులు ఇచ్చారు. అప్పట్లో అన్నవరం ఉప కమిషనర్‌గా పనిచేసిన డీఎల్‌వీ రమేష్‌బాబు, ఏఈవో వై.శ్రీనివాసరావులకు తాజాగా మంగళవారం దేవదాయ కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉప కమిషనర్‌పై చర్యలు తీసుకునే అధికారం దేవదాయ కమిషనర్‌కు మాత్రమే ఉంది. ఈ వ్యవహారంపై ఈవో రామచంద్రమోహన్ దేవదాయ కమిషనర్‌కు నివేదిక ఇవ్వగా తాజాగా ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

విస్ఫోటంపై...

- ఫోరెన్సిక్ నిపుణుల బృందం పరిశీలన
- పలు ఆధారాలు సేకరణ
- పేలని గ్యాస్ సిలిండర్లు
- ఐసీయూలో ముగ్గురికి కొనసాగుతున్న చికిత్స



పేలుడు ధాటికి ఫర్లాంగు దూరంలో పడ్డ శకలాలను గుర్తించి ఫొటోలు తీస్తున్న ఫోరెన్సిక్ నిపుణులు



అమలాపురం టౌన్, సెప్టెంబరు 17: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ శివారు రావులచెరువులో జరిగిన విస్ఫోటం ఘటనపై విచారణను వేగవంతం చేశారు. విజయవాడ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో పాటు జిల్లా క్లూస్ టీమ్ సభ్యులు పోలీసులతో కలిసి మంగళవారం సంఘటనా స్థలంలో పలు ఆధారాలను సేకరించారు. విస్ఫోటం ధాటికి ఫర్లాంగు దూరంలో పంట చేల మధ్య ఎక్కడో పడ్డ శకలాలను సైతం గుర్తించి వాటిని ఫొటోలు తీశారు. భవనం కుప్పకూలిపోయేంత స్థాయిలో విస్ఫోటం జరిగినప్పుడు ఆ ఇంట్లో పేలుడు పదార్థాలు ఎంతమేర ఉన్నాయో గుర్తిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ అసిస్టెంట్ సైంటిఫిక్ ఆఫీసర్ ఎన్.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలంలో అణువణువూ పరిశీలించారు. అంత పెద్ద ఎత్తున పేలుడు సంభవించినప్పటికీ ఆ ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు ఏమాత్రం చెక్కుచెదరకుండా శిథిలాల కింద ఉండడాన్ని గుర్తించి వాటిని బయటికి తీశారు. దీంతో గ్యాస్ సిలిండర్లు పేలడం వల్ల ప్రమాదం జరిగిందన్న వాదనకు ఫుల్‌స్టాప్ పడింది. ఘటనా స్థలంలో పొటాషియం క్లోరైడ్, పొటాషియం నైట్రేట్‌తో పాటు వివిధ రకాల కెమికల్స్‌ను, పేలుడు సామగ్రిని గుర్తించి శాంపిల్స్ సేకరించారు. పేలుడు ధాటికి ఎదురుగా ఉన్న రామాలయం గేటు తాళం వేసింది వేసినట్టుగా ఉండగా ఇనుప గెడ విడివడిపోవడంతో ప్రమాదం ఏ స్థాయిలో జరిగిందో గుర్తిస్తున్నారు. చిత్రమేమిటంటే ప్రమాదం జరగడానికి గంటముందు ఇంటి యజమాని గొవ్వాల నాగేశ్వరరావు మందుగుండు సామగ్రికి అవసరమైన పొటాషియం క్లోరైడ్‌ను సైకిల్‌పై తీసుకువచ్చాడు. ప్రమాదం అనంతరం పొటాషియం క్లోరైడ్ బ్యాగ్ సైకిల్‌కే ఉండిపోవడాన్ని మరుసటి రోజున గానీ ఎవరూ గుర్తించలేకపోయారు. సేకరించిన శాంపిల్స్‌ను విజయవాడ తరలించినట్టు అధికారులు తెలిపారు.

ప్రమాద కారణాలపై పోలీసుల ఆరా...

గ్యాస్ సిలిండర్లు చెక్కు చెదరలేదు. అయితే ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సంఘటనా సమయంలో ఇంట్లో భార్యభర్తలైన గొవ్వాల నాగేశ్వరరావు, నాగలక్ష్మి, కుమారుడు యల్లీష్‌రాజుతో పాటు యానాంకు చెందిన కుమార్తె కట్టా వేణు, మనుమడు వెంకట్ ఉన్నారు. నాగేశ్వరరావు దంపతులతో పాటు కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కిమ్స్ ఆసుపత్రిలో ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నారు. నాగలక్ష్మి తలకు ఉదయం ఆపరేషన్ నిర్వహించారు. కుమార్తె వేణు, మనుమడు నుంచి ఆధారాలు సేకరించేందుకు పోలీసులు పలు విధాలా ప్రయత్నించారు. ప్రమాదం జరగడానికి ముందు ఎవరైనా మతాబులు వంటివి ఏమైనా ఇంట్లో కాల్చారా అన్న దానిపై ఆరా తీస్తున్నారు. మందుగుండు సామగ్రి తయారీకి అవసరమైన సరుకును ఎవరు విక్రయిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఎంతమేర సరుకు కొనుగోలు చేశారు అన్న అంశంపై పోలీసులు దృష్టి సారించారు. పెద్ద మొత్తంలోనే పొటాషియం క్లోరైడ్, నైట్రేట్ కొనుగోలు చేసినట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. వాటితో పాటు బాణాసంచా సామగ్రి కూడా ఇంట్లో ఉన్నట్టు భావిస్తున్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఘటనా స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు. కుటుంబ సభ్యులు ముగ్గురు మినహా మిగిలిన అందరి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు చెప్పారు.



సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ నిపుణుల బృందం



రామాలయం గేటుకు వేసిన తాళం అలాగే ఉండగా.... పక్కనే పడ్డ సైకిల్‌పై గుర్తించిన పొటాషియం క్లోరైడ్

కామాంధ గురువుపై విచారణ!

- ప్రధానోపాధ్యాయుడు చంద్రు రామకృష్ణపై సస్పెన్షన్ వేటు
- విధుల నుంచి తొలగిస్తూ ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాలు
- లైంగిక వేధింపులను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దృష్టికి తెచ్చిన 8 మంది విద్యార్థినులు



ఆసుపత్రిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టరు

రంపచోడవరం, సెప్టెంబరు 17: అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలంలోని ఓ ఆశ్రమ బాలికల విద్యాలయంలో సుమారు ఎనిమిది మంది గిరిజన విద్యార్థినులపై ప్రధానోపాధ్యాయుడి లైంగిక వేధింపుల ఘటనపైమంగళవారం విచారణ ప్రారంభమైంది. ఈ ఘటనపై మీడియాలో కథనాలు రావడంతో అల్లూరి జిల్లా కలెక్టరు దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ వేగంగా స్పందించి విచారణతో పాటు తగు చర్యలకు సూచనలు చేశారు. ఈ మేరకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఐసీడీఎస్ అధికారి ఒకర్ని ప్రాథమిక విచారణకు పంపించారు. పూర్తిస్థాయిలో రహస్య ప్రాథమిక విచారణ జరిపించి నివేదిక ఆధారంగా హెచ్ఎం చంద్రు రామకృష్ణను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు పీవో చెప్పారు. మహిళా పోలీసులు కూడా విద్యార్థినుల నుంచి వేధింపుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఎనిమిది మంది విద్యార్థినుల్లో ముగ్గురు పదవ తరగతి, ఐదుగురు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. సదరు ప్రధానోపాధ్యాయుడు వేధించిన వైనాన్ని ఐసీడీఎస్ అధికారులకు, మహిళా పోలీసులకు వివరించారు. ఓ విద్యార్థినిని అయితే తాను ప్రేమిస్తున్నాని కూడా చెప్పి వేధించేవాడు. బయటకు చెప్పుకోలేని పలు విషయాలు ఈ వేధింపుల్లో దాగి ఉన్నాయి. శాఖాపరమైన విచారణలు సాగుతుండగా గిరిజన సంక్షేమ విద్యాలయాల స్థితిగతులపై పరిశీలన జరిపేందుకు వచ్చిన రంపచోడవరం ఇన్‌చార్జి మేజిస్ట్రేటు బాబు ముందు కూడా బాధిత విద్యార్థినులు తమపై జరిగిన లైంగిక వేధింపులను ఏకరువు పెట్టినట్టు సమాచారం. ఈ ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఎవరి నుంచైనా పిర్యాదు అందితే కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తామని గంగవరం ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు

రంపచోడవరం, సెప్టెంబరు 17: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ క్రమశిక్షణ చర్యలకు గురై రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను మంగళవారం ఆయన సబ్ కలెక్టరు కల్పశ్రీతో కలిసి పరామర్శించారు. విద్యార్థులు పలు సమస్యలను ఐటీడీఏ పీవోకు విన్నవించారు. కళాశాలలో జరిగిన ఘటనపై విచారణకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరుతో పాటు మరి కొంత మందితో కమిటీని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సబ్ కలెక్టరు కల్పశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎం వెంకటఇందిర, వైద్యాధికారులు క్రాంతికిరణ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.6 లక్షలు విరాళం

అన్నవరం, సెప్టెంబరు 17: రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి మంగళవారం హైదరాబాద్‌కు చెందిన పోతుగుంట శ్రీలక్ష్మి రూ.6 లక్షలు విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందజేసింది. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి ప్రసాదం అందజేశారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో 'శ్రీప్రకాష్' అధినేత నరసింహారావు

జాతీయ స్థాయి పోటీలకు
'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

తుని రూరల్, సెప్టెంబరు 17: ఈ నెల 14 నుంచి 16 వరకు సీబీఎస్ఈ బోర్డు ఆధ్వర్యంలో నల్గొండలోని ఏకశిలా అడ్వాన్స్‌డ్ లెర్నింగ్ స్కూల్లో జరిగిన క్లస్టర్-7 (ఆంధ్ర, తెలంగాణ) అథ్లెటిక్స్ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 4X400 మీటర్ల రిలే పరుగులో అండర్-19 విభాగంలో ప్లస్ 1, ప్లస్ 2 వై.జయసత్యకుమార్, ఆదిత్యకుమార్, ఎల్.పూర్ణ శ్యామ్‌నాయుడు, శాశ్వత్ ప్రేమ్, ఎండీ సునీల్‌కుమార్ ప్రథమస్థానంలో నిలిచారు. జావలిన్ త్రోలో ఆదిత్యకుమార్ 40.90 మీటర్లతో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించడమే కాకుండా అక్టోబరు 6 నుంచి 8వ తేదీ వరకు వారాణసీలోని సెయింట్ అతులానంద్ కాన్వెంట్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 5000 మీటర్ల పరుగులో ఎండీ సునీల్‌కుమార్ కాంస్య పతకం సాధించాడని ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కోచ్ శ్రీరామాంజనేయులు తదితరులు అభినందించారు.

దసరా, దీపావళి పర్వదినాలకు
21 వారాంతపు 'పూజ' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 17: రానున్న దసరా, దీపావళి పండగ రోజుల్లో ప్రయాణికులకు మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే సామర్లకోట మీదుగా విశాఖ-బెంగళూరు-విశాఖ మధ్య నవంబరు 25 వరకు 21 వారాంతపు 'పూజ' ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్టు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉన్నతాధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.


విశాఖపట్నం-బెంగళూరు (08543) ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ విశాఖలో ప్రతి ఆదివారం సాయంత్రం 3.55 గంటలకు బయల్దేరుతుంది. దువ్వాడ, యలమంచిలి మీదుగా సాయంత్రం 5.54 గంటలకు సామర్లకోట, 6.38 గంటలకు రాజమహేంద్రవరం, అక్కడి నుంచి నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, కుప్పం, బంగారుపేట, కృష్ణరాజపురం మీదుగా సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరు చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 22, 29, అక్టోబరు 6, 13, 20, 27, నవంబరు 3, 10, 17, 24 తేదీల్లో ప్రతి ఆదివారం బయల్దేరుతుంది.

బెంగళూరు-విశాఖ (08544) ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం సాయంత్రం 3.55 గంటలకు బెంగళూరులో బయల్దేరి కృష్ణరాజపురం, బంగారుపేట, కుప్పం, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, తణుకు, నిడదవోలు మీదుగా ఉదయం 8.33 గంటలకు రాజమహేంద్రవరం, 9.22 గంటలకు సామర్లకోట, యలమంచిలి, దువ్వాడ మీదుగా మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 16, 23, 30, అక్టోబరు 7, 14, 31, 28 నవంబరు 4, 11, 18, 25 తేదీల్లో ప్రతి సోమవారం బెంగుళూరులో బయల్దేరుతుంది.

ఈ రైళ్లలో ప్రయాణించదలచిన వారు ఆయా స్టేషన్లలోని బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు 'పడాల' కన్నుమూత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: అల్లూరి యువజన సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు (70) అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు తొలుత రాజహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోను, ఆటుపై దేవీచౌక్ సమీపంలోని బుద్ధుడు ఆసుపత్రిలోను చికిత్స అందించారు. అయితే షుగరు వ్యాధి కారణంగా ఆయన కాలు పాదం దెబ్బతినడంతో పరిస్థితి విషమంగా మారింది. రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సభ్యులు, బంధువులు కలిసి అంబులెన్సులో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం నుంచి కాకినాడ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన కాలి వేళ్లను శస్త్ర చికిత్స చేసి తొలగించారు. అయినా బాగోలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 7 గంటలకు పడాల తుది శ్వాస విడిచారు. పడాల స్వస్థలం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోరక్షణపేట. ఆయన తండ్రి పడాల రామారావు శతాధిక గ్రంథకర్త, కమ్యూనిస్ట్ ఉద్యమ నేత. తండ్రి స్ఫూర్తితో వీరభద్రరావు నిరంతరం అభ్యుదయ భావాలతో పోరాడారు. కోస్తా సమయం పత్రిక ఎడిటర్‌గా విప్లవ పార్టీల కరపత్రాలను తన ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు పేరును రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతానికి పెట్టాలని తనదైన శైలిలో ప్రభుత్వాలను ప్రభావితం చేసిన యోధుడు పడాల. అల్లూరి జీవితం కోసం అనేక పరిశోధనలు చేసి పుస్తకాన్ని కూడా రచించారు. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు. కుమారులిద్దరూ గతంలోనే అనారోగ్యంతో మరణించారు. అయినా ఎక్కడా కుంగిపోకుండా నిరంతరం రాజీలేని జీవన పోరాటం చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో పడాలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మృతికి ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. పలువురు జర్నలిస్టులు, రచయితలు సంతాపం తెలిపారు.



పడాల వీరభద్రరావు (పాత చిత్రం)

40 కాసుల బంగారం చోరీ



కిర్లంపూడి, సెప్టెంబరు 17: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో దొంగలు పట్టపగలే చేతివాటం ప్రదర్శించారు. సోమవరానికి చెందిన జ్యోతుల వీర వెంకట సత్యనారాయణ కుటుంబంతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి 40 కాసుల బంగారం, నగదు దొంగలించారు. దీనిపై బాధితులు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించారు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకునేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నారని చెప్పారు.

తూర్పుగోదావరి

ఏజెన్సీ సమాచారం

ఆవాస యోజన గృహాలు ప్రారంభం

దేవీపట్నం, సెప్టెంబర్ 17: పీఎంఏవై గ్రామీణ 2.0 యాప్ ఆవిష్కరణ సందర్భంగా మండలంలోని ఇందుకూరు పంచాయతీ రావిలంకలో గృహనిర్మాణ శాఖ మంగళవారం ప్రధాన మంత్రి ఆవాస యోజన 2021-22 పథకంలో మంజూరైన నూతన ఇళ్లకు గృహప్రవేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్నకుమారి, మండల అధ్యక్షుడు మరిసెట్ల వెంకటేశ్వరావు, మండల ప్రధాన కార్యదర్శి మెహర్‌బాబా, సర్పంచ్ కుంజం రాజామణి, ముచ్చు నాగేశ్వరరావు, గౌరీశ్వరి, శివరామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆవాసయోజన గృహ పత్రాలు అందజేత

కూనవరం, సెప్టెంబర్ 17: ప్రధానమంత్రి ఆవాస యోజన స్కీమ్‌లో మంజూరైన గృహాలకు మంగళవారం మండలంలోని కరకగూడెం గ్రామంలో గృహ ప్రవేశం నిర్వహించారు. గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారులకు గృహానికి సంబంధించిన పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జడ్పీటీసీ గుజ్జా విజయ, టీడీపీ మండల ప్రెసిడెంట్ బరపాటి ప్రకాశరావు, నోముల రామారావు, దాసరి నరేంద్ర పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

రంపచోడవరం, సెప్టెంబరు 17: ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్యక్రమం ఏర్పాటు చేసిందని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం ఆయన సబ్ కలెక్టరు కల్పశ్రీతో కలిసి స్వచ్ఛతా హి సేవా ర్యాలీ ప్రారంభించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కె.బాలకృష్ణ, పండా కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు ఉలవల లక్ష్మి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, డీఎల్‌పీవో కె.కోటేశ్వరరావు, ఎంపీడీవో హరికృష్ణ, డీఎల్‌పీవో చిన్నబ్బులు, ఈవోపీఆర్డీ జాన్ విల్సన్, ఏపీడీ ఎ.శ్రీనివాసరావు, డీపీఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, వివిధ పాఠశాలలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవీపట్నంలో స్వచ్ఛతా హి

దేవీపట్నం, సెప్టెంబర్ 17: మండలంలో ఇందుకూరుపేట, ఇందుకూరు తదితర గ్రామాల్లో ఎంపీడీవో ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందుకూరు 1 ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో విద్యార్థులు ర్యాలీగా నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, కార్యదర్శి వెంకటరమణ, హెచ్ఎం ముత్యాలరెడ్డి, సెక్రటరీ భారతి, వెల్ఫేర్ జయాంజలి, నాగమణి, పార్వతి పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో అన్నదానం

కూనవరం, సెప్టెంబర్ 17: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా మండల కేంద్రం దుర్గాదేవి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన లడ్డూ వేలం పాటలో రూ.4500కు భాస్కర్ అనే వ్యక్తి లడ్డూను దక్కించుకున్నారు. ఆలయ నిర్వాహకులు శాకా వెంకట్రావు ఈ కార్యక్రమం నిర్వహించారు.

డిప్యూటీ సెక్రటరీకి ఘన సన్మానం

మోతుగూడెం, సెప్టెంబరు17: మోతుగూడెం చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పని చేస్తున్న పి. నాగేశ్వరరావు డిప్యూటీ సెక్రటరీగా పదోన్నతి లభించింది. విద్యుత్ సౌధా విజయవాడ ప్రధాన కార్యాలయానికి బదిలీపై వెళుతున్న ఆయనను మంగళవారం స్థానిక చీఫ్ ఇంజినీర్ ఆఫీసులో సీఈ వాసుదేవరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఐదేళ్ళుగా సీలేరు కాంప్లెక్స్‌లో ఎంతో నిబద్ధతతో సేవలు అందించారని కొనియాడారు. పదోన్నతిపై బదిలీపై వెళ్తున్న అసిస్టెంట్ సెక్రటరీ నాగేశ్వరరావు విద్యుత్ ఇంజనీర్, సీఈ ఆఫీస్ సిబ్బంది, విద్యుత్ కార్మికులు, కార్మిక నాయకులు ఘనంగా సన్మానించారు.

గిరిజన ప్రాంత అభివృద్ధికి సహకరించాలి

రంపచోడవరం, సెప్టెంబరు 17: ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పిలుపునిచ్చారు మంగళవారం స్థానిక పీఎంఆర్‌సీ ప్రాంగణంలో 75వ సామాజిక్ అధికారిక దివ్యజన్ అండర్ ద ఆడిప్ పథకం ఆధ్వర్యంలో ఏలింకో స్వచ్ఛంద సంస్థ ద్వారా దివ్యాంగులకు పరికరాల పంపిణీ కార్యక్రమానికి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టరు కల్పశ్రీ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.రామవరం, మారేడుమిల్లి, గంగవరం మండలాలకు సంబంధించిన 142 మంది దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ వికలాంగుల సంక్షేమశాఖ ద్వారా ట్రై సైకిల్, బ్యాటరీ సైకిల్‌లు, వీల్ ఛైర్స్, చెవిటి మెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగా బొజ్జయ్య, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, ఎంపీపీ సార్ల లలిత, వైస్ ఎంపీపీలు పండా కుమారి, కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అన్నసంతర్పణ

వరరామచంద్రాపురం, సెప్టెంబరు17: మండల కేంద్రంలోని ఇందిరా సెంటర్‌లో ఉన్న విఘ్నేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం మహాన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు చిగురు బాలాజీ, వంశీ, శంకర్‌రావు, యర్రా రాంబాబు నిర్వహించారు. గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అన్నసంతర్పణ కార్యక్రమం గ్రామస్తుల సహాయ సహకారాలతో నిర్వహించారు. ఈక్రమంలోనే వీడియో కాలనీలో ఏర్పాటు చేసిన సిద్ధి వినాయక మండపం దగ్గర మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు

రంపచోడవరం, సెప్టెంబరు 17: గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ కట్టా సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్ కలెక్టరు కల్పశ్రీతో కలిసి వ్యవసాయ అనుబంధ శాఖలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీ అన్ని మండలాల్లోని రైతులతో ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించాలన్నారు. చేపల పెంపకం రైతులతో సమావేశాలు నిర్వహించాలని మత్స్యశాఖ ఎఫ్‌డీవో బాలాజీని ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో డిసెంబరు నాటికి సెల్ టవర్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కోతుల నివారణకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు రైతుల భూములను గుర్తించాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరక్టర్లు సీహెచ్‌కేవీ చౌదరి, సావిత్రి, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం'

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, దానిని విధ్వంసం చేయాలని అనుకోవడంలేదని, దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి కుమారస్వామి దృష్టికి తీసుకెళ్లామని, దానిపై ఆయనకు సంపూర్ణమైన అవగాహన ఉందని బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని, లాభాల్లోకి తీసుకురావాలనే ఆలోచనే కాని ఏనాడూ ధ్వంసం చేయాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని అన్నారు. అలాగే ముంబయి నటి జత్వానీ కేసులో ఐపీఎస్ అధికారులపై చర్యలు స్వాగతిస్తున్నామన్నారు. ఆలస్యమైనా కూడా ఇవాళ ఆ మహిళకు న్యాయం జరిగిందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజానగరం, సెప్టెంబరు 17 : జాతీయ రహదారిపై తూర్పుగోనగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ కథనం ప్రకారం జగ్గంపేట గ్రామానికి చెందిన గొర్ల వెంకటరమణ(48),భార్య వెంకట స్వప్న, కుమారుడు రోహిత్ శ్రీరామ్‌తో కలిసి 16న ఉదయం మోటార్ సైకిల్‌పై ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. దర్శనం అనంతరం ఇంటికి తిరిగి వస్తూ మార్గమధ్యలో ఐఎస్‌టీఎస్ మహిళా కళాశాల వద్దకు చేరుకునే సరికి ఎదురుగా వేగంగా వస్తున్న మరో మోటార్ వీరిని ఢీకొంది. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీనడంతో వెంకటరమణకు తలకు బలమైన గాయం కాగా, మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. వెంకట రమణ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 17: తెలుగు జాతి చరిత్రలో మహోన్నత రాజకీయ నాయకుడిగా అరుదైన అద్భుత కోణాలున్న నాయకుడు వావిలాల గోపాలకృష్ణయ్యని ఆంధ్ర కేసరి యువజన సమితి సీనియర్ సభ్యుడు, ఆడిటర్ బీఎస్ శర్మ అన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య 118వ జయంతోత్సవాన్ని సమితి ఆధ్వర్యంలో ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వావిలాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

● రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, సెప్టెంబరు17 : మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, వారికి అన్యాయం జరిగితే సహించబోమని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచిలో దుర్వినియోగమైన రూ. 67.52 లక్షలను డీఆర్‌డీఏ, బాంకు అధికారుల సమక్షంలో సంబంధిత ఖాతాదారులకు తిరిగి చెల్లింపు ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా జి.ఎర్రంపాలెంలోని బీఓబీ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో మహిళాసంక్షేమం, అభివృద్ధికి మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. ఇంకా ఆధారాలు ఉండి డబ్బులు రాకపోతే ఆందోళన చెందవద్దని వాటిని కూడా పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. బీఓబీ బ్రాంచ్‌కు చెందిన సీసీ నానిబాబు చేసిన అవకతవకలను స్థానిక నాయకులు తన దృష్టికి తీసుకురాగానే ఈఏడాది జూలై5న తాను ధర్నా చేశానని గుర్తు చేశారు. అప్పట్లో 45 రోజులలోఈ సొమ్ము తిరిగి చెల్లిస్తామని తనకు అధికార్లు హామీ ఇచ్చారన్నారు. దుర్వినియోగమైన సొమ్మును తిరిగి రప్పించి బాధితులకు న్యాయం చేసే విషయంలో జిల్లా కలెక్టరు, డీఆర్‌డీఏ పీడీ, బాంకు అధికారుల కృషి అభినందనీయమన్నారు. స్థానిక కూటమి నాయకులు, తనసతీమణి వెంకటలక్ష్మి ఇక్కడే అందుబాటులో ఉంటారని ఇబ్బందులు ఉంటే వాటిని సరిచేస్తారని చెప్పారు.


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

రూ.60 లక్షల వైద్య పరికరాలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17: అత్యుత్తమ నేత్ర వైద్య సేవలందిస్తున్న గౌతమీ నేత్రాలయం సేవలు ప్రశంసనీయమని బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరంలో జరిగిన ఒక కార్యక్రమంలో రోటరీ క్లబ్ సమకూర్చిన కంటి శస్త్ర చికిత్స కోసం ఉపయోగించే అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోప్, రెటీనా, శుక్లం శస్త్ర చికిత్సలకు ఉపయోగించే అత్యాధునిక వైద్య పరికరాలను ఎంపీ పురందేశ్వరి చేతులమీదుగా గౌతమీ నేత్రాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా వానప్రస్థ ఆశ్రమం వద్ద ఆమెమాట్లాడుతూ చిన్నపిల్లల్లో అంధత్వ నివారణకు విశ్వవ్యాప్తంగా కృషి చేస్తున్న గౌతమీ నేత్రాలయం సేవలు అభినందనీయమన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం చేశామని, మొత్తం ఒక రోజు ఖర్చు తాను భరించానని తెలిపారు. గౌతమీ నేత్రాలయం ఛైర్మన్ డాక్టర్ రాజు మాట్లాడుతూ దృఢ సంకల్పం ద్వారా దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళతామన్నారు. రోటరీ 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుమారు రూ.60 లక్షల విలువైన అధునాతన వైద్య పరికరాలను ఆసుపత్రికి అందజేశామని తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

చాగల్లు/రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17: విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు ఆమె వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాత్రలు వేసుకుంటే సరిపోదని, భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రంగా కడగాలన్నారు. ఆకు కూరలు, కూరగాయలు, పాలు, పండ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. పిల్లలను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. నారాయణపురం మున్సిపల్ హైస్కూల్, అంబేద్కర్‌నగర్, వీఎల్ పురం, శ్యామలాంబ ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం జరిగిన కార్యక్రమాల్లో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.వసుంధర పాల్గొన్నారు. విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

బిక్కవోలు, సెప్టెంబరు 17: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొంకుదురు ఉన్నత పాఠశాలలో టీడీపీ మండల అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, సర్పంచ్ సత్తి వీరమణి, మాజీ ఎంపీటీసీ చింతా శ్రీనివాసరెడ్డి మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఊలపల్లి ఉన్నత పాఠశాలలో 241 మంది విద్యార్థులకు కూటమి నేతలు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, బండారు శివ మాత్రలను అందజేశారు. బిక్కవోలు శ్రీప్రజా కళాశాలలో విద్యార్థులకు టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి మాత్రలను అందించారు.

రంగంపేట మండలంలో..

రంగంపేట, సెప్టెంబరు 17 : "జాతీయ నులిపురుగుల నిర్మూలన" కార్యక్రమం సందర్భంగా వడిశలేరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ల గోవింద్ నులిపురుగుల మాత్రలను మింగించారు. రంగంపేట మండలంలో రంగంపేట, సింగంపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల, ప్రైవేటు పాఠశాలలో ఉన్న విద్యార్థులు 8658 మంది చిన్నారులకు గాను 8479 మంది చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్టు రంగంపేట పీహెచ్‌సీ సీహెచ్‌వో కె.జయమణి తెలిపారు. మిగిలిన 179 మంది చిన్నారులకు బుధవారం సచివాలయంలో అందజేస్తామని ఆమె తెలిపారు.


చాగల్లు హైస్కూల్లో పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నులిపురుగుల ద్వారా చిన్నారుల్లో రక్త హీనత

అనపర్తి, సెప్టెంబరు 17 : నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమ తులసి మాత్రలు పంపిణీ చేశారు. అదే విధంగా అనపర్తి కేపీఆర్ ఉన్నత పాఠశాలలో టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి చిన్నారులకు నులుపురుగు నివారణ మందును పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం..


అనపర్తిలో రోడ్లను శుభ్రపరుస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 17 : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా పక్షం రోజుల పాటు దేశ వ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను మంగళవారం ఎమ్మెల్యే నల్లమిల్లి అనపర్తిలో ప్రారంభించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకు అధికారులు, కూటమి నాయకులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అధికారులతో కలిసి చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. అనంతరం దేవీచౌక్ వద్ద కెనాల్ రోడ్డుపై మానవహారంలో పాల్గొని స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో హిమ మహేశ్వరి, ఈవోపీఆర్డీ పద్మజ, ఎమ్ఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ, డ్వాక్రా యానిమేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగంపేట: మండంలోని వడిశలేరులో అవగాహన స్వచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని అన్నారు. అనంతరం స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో పాఠశాల విద్యార్థులతో మానవహారం నిర్వహించారు.

బిక్కవోలు: కొంకుదురులో జరిగిన కార్యక్రమాలను జడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రతతోనే మనం ఆరోగ్యంగా ఉంటామని సూచించారు. బిక్కవోలులోని ప్రాచీన ఆలయాల్లో ఈవో ఆకెళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో దేవదాయశాఖ సిబ్బంది సేవా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే లక్ష్మీగణపతి ఆలయంలో భక్తులు కాళ్లు కడుక్కునే ప్రదేశాన్ని, మరుగుదొడ్లను శుభ్రపరిచారు. అలాగే గోలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.

ధవళేశ్వరం: స్థానిక కాటన్ బ్యారేజ్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రామాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం అధికారులు, నాయకులు విద్యార్థులతో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.


ధవళేశ్వరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కోరుకొండ: మండలంలోని జంబుపట్నం, మునగాల, రాఘవాపురం, కణుపూరు, కోరుకొండ, తదితర గ్రామాల్లో స్వచ్ఛతా హీ ర్యాలీలు, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా శుభ్రతపై మెగా డ్రైవ్ నిర్వహించారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులతో సామూహిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ వుల్లి సూర్యకుమారి, సర్పంచ్‌లు కర్రి లక్ష్మీసరోజ, వుల్లి అప్పన్నదొర, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, మతార్ బీబీ, జాజుల రాము, ముంద్రు సంధ్యరాణి పాల్గొన్నారు.

మోదీ జన్మదిన వేడుకలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను మంగళవారం బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక క్వారీ మార్కెట్ సెంటర్లోని అన్న క్యాంటీన్ వద్ద ఎంపీ పురందేశ్వరి కేక్ కట్ చేశారు. మొక్కను నాటారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, కాలెపు సాయిరాం, బేతిరెడ్డి ఆదిత్య, వీరా వీరాంజనేయులు, నాగదేవి పాల్గొన్నారు. గౌతమీ జీవకారుణ్య వృద్ధాశ్రమంలోని మహిళలకు బీజేపీ రాష్ట్ర నాయకుడు క్షత్రియ బాలసుబ్రహ్మణ్య సింగ్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. నక్కెళ్ల బాబూరావు, క్రొవ్విడి సురేష్, ఎస్ఎస్ఎస్ చంద్రశేఖర్ సౌజన్యంతో వీటిని సమకూర్చారు.

పీహెచ్‌డీ పట్టా ప్రదానం

దివాన్‌చెరువు, సెప్టెంబరు17: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఫుల్ టైం రీసెర్చ్‌స్కాలర్ ఆలూరిలక్ష్మికి ఇన్‌ఛార్జి వీసీ వై.శ్రీనివాసరావు పీహెచ్‌డీ పట్టాను మంగళవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ఈ అసోసియేట్ ప్రొఫెసర్ డి.లత మార్గదర్శకత్వంలో లక్ష్మి పీహెచ్‌డీ పూర్తిచేశారని చెప్పారు. వివిధ డీప్ లెర్నింగ్ పద్ధతులద్వారా తెలుగు ఆర్టికల్స్ టెక్స్ట్‌ను సంక్షిప్తం చేసే విధానాలపై పరిశోధన చేశారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, పరిశోధనాభివృద్ధి విభాగం డీన్ ఆచార్య కె.రమణేశ్వరి, గైడ్ డి.లత తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల పంపిణీ

బిక్కవోలు, సెప్టెంబరు 14: అచ్యుతాపురం సెజ్ ఎసెన్షియా ఫార్మాలో జరిగిన దుర్ఘటనలో మృతి చెందిన బిక్కవోలుకు చెందిన కొప్పర్తి గణేష్ కుటుంబ సభ్యులకు శనివారం మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జక్కంపూడి రాజాలు వైసీపీ ప్రకటించిన రూ.ఐదు లక్షల చెక్కు అందజేశారు.

నిలకడగా గోదావరి

ధవళేశ్వరం, సెప్టెంబరు17:ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ 175 గేట్లను అరమీటరు మేర పైకి ఎత్తి 2,39,240 క్యూసెక్కుల మిగుల ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 4,600 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 2300 క్యూసెక్కులు, పశ్చిమడెల్టా ప్రధాన పంట కాలువకు 6500 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. టూటౌన్ సీఐ దుర్గారావు కథనం ప్రకారం.. బుచ్చయ్యనగర్‌కి చెందిన బి.కామాక్షి(42) కుటుంబ కలహాల నేపథ్యంలో రోడ్ కం రైలు బ్రిడ్జి నుంచి మంగళవారం సాయంత్రం గోదావరిలోకి దూకింది. కొంత మంది మత్స్యకారులు గమనించి ఆమెను రక్షించారు. భర్తను పిలిపించి ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు.

నిత్యావసరాల అందజేత

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: రాజమహేంద్రవరం చందా సత్రంలోని పునరావస కేంద్రంలో ఉన్న లంక ప్రాంత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రభుత్వ తరఫున ఆర్థికసాయం చేశారు. మంగళవారం చందా సత్రానికి వెళ్ళిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వరద బాధితులను పరామర్శించి నిత్యావసరాలు అందించారు. అలాగే స్థానిక 45వ డివిజన్ రాజీవ్ నగర్‌కు చెందిన 60 కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. ప్రకృతి విపత్తులు వరదలు, భారీ వర్షాలతో నష్టపోయిన ప్రతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'తెలుగు విశ్వవిద్యాలయం తరలిపోకుండా రక్షించండి'

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: రాజమహేంద్రవరం ప్రజలు గాఢనిద్రలోంచి మేల్కొని ప్రభుత్వ సంస్థలను కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో స్థానిక పొట్టి శ్రీరాములు విద్యాపీఠంలో అడ్మిషన్లు ఇవ్వలేదన్నారు. పదేళ్ల ఉమ్మడి ఒప్పందాల గడువు పూర్తికావడంతో తెలుగు యూనివర్శిటీ విడిపోయిందని, తెలంగాణకు ఒక భాగం వెళ్లిపోయిందన్నారు. అలాగే రాజమహేంద్రవరంలోని పీఠం కూడా తిరుపతి తరలిపోతుందన్నారు. 16 ఎకరాల భూములు ఉన్న దీనిని రాజమహేంద్రవరంలోనే ఉంచి యూనివర్శిటీగా మార్చాలన్నారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కళాశాలలకు సంబంధించి ఐదు కళాశాలలను అవసరం లేదని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ పంపారని, ఉన్న కళాశాలను ప్రైవేట్ పరం చేయాలని చూడడం సరికాదన్నారు. రాజమహేంద్రవరానికి ఎంపీగా చేసిన వ్యక్తి సెంట్రల్ జైలుకు చెందిన ప్రభుత్వ భూమి పదెకరాలను మంజీరాకు ధారాదత్తం చేశాడని, దీని వల్ల మెడికల్ కళాశాలకు ఇప్పుడు భూమి చాలడం లేదన్నారు. మూడోదిగా రాజమహేంద్రవరంలో ఉండే జాతీయ వ్యాధి నిరోధిక కేంద్రాన్ని మంగళగిరి తరలిస్తున్నారని, ఇది దారుణమన్నారు. సీతంపేటలో మనకు సంస్కృత కళాశాల మూడెకరాల భూమిని పరిరక్షించి వేద పాఠశాల పెట్టాలని డిమాండ్ చేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ధవళేశ్వరం, సెప్టెంబరు17:, కరాటే బెల్ట్ టెస్ట్‌లో కరాటే మాష్టారు కె. నాగిరెడ్డి వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఏలూరులో జపాన్ షోటోకాన్ కరాటే2 కన్నిన్ జ్యుకు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి పోటీల్లో 11 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించారు. బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులను, కరాటే మాష్టారు కె. నాగిరెడ్డిని ధవళేశ్వరం సీఐ కె. గణేష్, టీడీపీ నాయకుడు సావాడ శ్రీనివాసు రెడ్డి అభినందించారు.

నిత్యావసరాల పంపిణీ

కోరుకొండ, సెప్టెంబరు17: బురద కాలువ వరద బాధితులకు మంగళవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నగదు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులకు గుడ్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల సాకారానికి కృషి


పీఎంఏవై ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడి


నూతన గృహాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

బిక్కవోలు, సెప్టెంబరు 17: పేదింటి వారి సొంతింటి కలను నెరవేర్చడానికి ఇకపై రూ.నాలుగు లక్షలతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఊలపల్లి గ్రామంలో మంగళవారం ఆయన ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణంలో నిర్మించిన ఇళ్లను, మంజూరైన ఇళ్లకు భూమిపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలకు 9132 ఇళ్లు మంజూరయ్యాయని, ఇందులో 5465 నిర్మాణంలో ఉన్నాయన్నారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణలో 703 ఇళ్లు మంజూరు కాగా 365 నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ.2.50 లక్షలు సమకూరుస్తుందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం కేంద్రం ఇచ్చిన నిధులతోనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి, రాష్ట్రవాటా నిధులు విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు.

అనపర్తిలో గృహ ప్రవేశాలు

అనపర్తి, సెప్టెంబరు 17 :పీఎంఏవై పథకం ద్వారా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులు మంగళవారం గృహ ప్రవేశాలు చేశారు. అనపర్తిలోని మహాలక్ష్మి పేటలో నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమంలో జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి అధికారులతో కలిసి పాల్గొన్నారు. లబ్ధిదారులకు అధికారులు ఇంటి తాళాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతో బాటు ఎంపీడీవో హిమ మహేశ్వరి, తహసీల్దార్ అనిల్ కుమార్, ఈవోపీఆర్డీ పద్మజ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పీఎంఏవైతో సొంతింటి కల సాకారం

రాజానగరం, సెప్టెంబరు 17: ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంతో పేదల సొంతింటి కల సాకారమవుతుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని మండలంలో కానవరంలో ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో భాగంగా నూతనంగా నిర్మించిన గృహ సముదాయాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయా గృహాలకు సంబంధించిన తాళాలను లబ్ధిదారులకు అందించారు. బత్తుల వెంకటలక్ష్మి, తహసీల్దార్ లక్ష్మీలావణ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కోరుకొండ: మండలంలోని దోసకాయపల్లిలో నిర్మించిన గృహ సముదాయాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. లబ్ధిదారులకు స్వీట్లు తినిపించి ఇంటితాళాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా యశోదమ్మ, దారా రాంబాబు, జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు మార్ని రాము, మార్ని వీరాంజనేయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు







స్వచ్ఛతా హి సేవ మానవహారం.. పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

15 రోజుల పాటు స్వచ్ఛతా హి సేవ : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: జిల్లాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం వైజంక్షన్ వద్ద మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బాలరామకృష్ణ, కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు. తొలుత వారంతా స్వచ్ఛతా హి సేవ పోస్టరు ఆవిష్కరించి బ్యానర్‌పై సంతకాలు చేశారు.కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ 15 రోజుల పాటు కాలుష్య రహిత సమాజంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిద్దామన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రధాని మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అమలు చేస్తున్నారన్నారు.





కలెక్టరేట్ చెంతనే ఉన్న డైట్ కళాశాల ప్రాంగణం

నాచు పట్టి ఉన్న సింక్

కలెక్టరమ్మా.. డైట్ చూడమ్మా!

- అధ్వానంగా డైట్ కళాశాల ప్రాంగణం
- కలెక్టరేట్ చెంతనే ఉన్నా ఇంతే
- సమస్యలతో సతమతం
- హాస్టళ్లలో 150 మంది విద్యార్థులు
- రాత్రి వేళ పాముల సంచారం
- వాచ్‌మెన్ లేక భయం..భయం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 17 : జిల్లా సమస్యలన్నీ పరిష్కరించేది అక్కడే..అయితే ఆ చెంతనే సమస్య ఉన్నా ఎవరూ కన్నెత్తి చూడడం లేదు.. విద్యార్థులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకోవడంలేదు. ఇదీ కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న బొమ్మూరు డైట్ కళాశాల ప్రాంగణం దుస్థితి. ఆ కళాశాల వసతిగృహాలు చాలా అధ్వానంగా ఉన్నాయి. డైట్ కళాశాల ప్రాంగణంలో ఉన్న రెండు వసతి గృహాల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. వసతిగృహాల్లో సుమారు 150 మంది విద్యార్థిని విద్యార్థులు ఉంటున్నారు. వసతిగృహాల పరిస్థితి చూస్తే ముక్కుమూసుకోవడం తప్పనిసరి. పాడుబడ్డ భవనంలో పరిశుభ్రత లేని పరిస్థితిలో వసతి గృహాల గదులు కంపుకొడుతున్నాయి. విద్యార్థులు భోజనాలు చేసే మెస్ రూమ్, దానికి అనుకుని ఉన్న డ్రైనేజీ అధ్వానంగా ఉంది. ప్రాంగణంలోకి పందులు సంచారం విపరీతంగా ఉంది. విద్యార్థులు వినియోగించే సింక్ నాచుపట్టి దుర్వాసన వస్తోంది. వసతి గృహాల ప్రాంగణం పిచ్చిమొక్కలు, తుప్పలతో నిండిపోయింది.రాత్రివేళ కిటికీల గుండా పాములు, పురుగులు వంటివి లోపలకు ప్రవేశిస్తుండడంతో విద్యార్థులు భయపడుతున్నారు.బాత్‌రూమ్‌లు డోర్లు ఊడిపోయి, గోడలు పెచ్చుపెచ్చులుగా ఊడి నివాసయోగ్యంగా లేవు.విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బాలికల,బాలుర హాస్టళ్ల మధ్య రక్షణ గోడ లేదు..

డైట్ కళాశాల ప్రాంగణంలో ఉన్న బాలబాలికల వసతి గృహాల మధ్య రక్షణ గోడ లేదు. కనీసం అక్కడ వాచ్‌మెన్ కనిపించడంలేదు. బాలికల వసతి గృహానికి మహిళా అధ్యాపకురాలు, బాలుర వసతి గృహానికి అధ్యాపకుడు ఇంచార్జీలుగా ఉన్నారు. వారి పర్యవేక్షణ తీరు ఎలా ఉందో వసతి గృహాలను చూస్తే అర్థమవుతుంది. కౌమార దశలో ఉన్న బాలబాలికల పట్ల కనీస జాగ్రత్త చర్యలు కానరావడంలేదు. రెండు వసతి గృహాల మధ్య కట్టుదిట్టమైన చర్యలు లేవు. వసతి గృహాల్లో పరిస్థితులు విద్యార్థినీ, విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నించేలా ఉన్నాయి. వసతి గృహాలకు ప్రత్యేకంగా వార్డెన్లను నియమించుకోవాల్సి ఉంది. కాని ఇక్కడ అధ్యాపకులకే ఆ బాధ్యతలు అప్పగించడంతో వారు టీచింగ్‌తో పాటు వసతి గృహ నిర్వహణ చేయలేకపోతున్నారనేది కనిపిస్తోంది. ఒక్కో విద్యార్థి నుంచి మెస్‌కు నెలకి రూ.2 వేలు.. ఏడాదికి వసతికి రూ.4 వేలు కట్టించుకుంటున్నా కనీస సంరక్షణ చర్యల్లేవ్..దీంతో విద్యార్థులు లబోదిబోమంటున్నారు. వసతి గృహాలపై కనీస పర్యవేక్షణ లేకపోవడం..ఎవరుపడితే వారు డైట్ ప్రాంగణంలోకి వచ్చి వెళ్లడంతో పరిస్థితి దారుణంగా ఉంది. అక్కడ లోపలికి వెళ్లే వారిని ఆపి ప్రశ్నించేవారే లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇకనైనా ఉన్నతాధికా రులు దృష్టి సారించాల్సి ఉంది.



డైట్ కళాశాల ఆవరణలో నెలకొన్న అపారిశుధ్యం

హైవే దాటిన చిరుత పులి | 8 | ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : కలెక్టర్



మందుబాబులకు.. పండగే!

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

- నేడో రేపో కొత్త మద్యం పాలసీ
- ప్రైవేటు షాపులకే కూటమి సై!
- ధరలపై ఎంఎన్‌సీలతో ఒప్పందం
- అందుబాటులో నాణ్యమైన కిక్
- క్వార్టర్ రూ.180.. నైన్టీ రూ.100
- జగన్ పిచ్చి బ్రాండ్లకు స్వస్తి
- నేడు కేబినెట్‌లో నిర్ణయం

కొత్త మద్యం పాలసీని కూటమి ప్రభుత్వం నేడో రేపో ప్రకటించే అవకాశం ఉంది. ప్రధానంగా జగన్ పిచ్చి బ్రాం డ్లను నిర్మూలించనుంది.దీంతో ఐదేళ్ల పాటు నాసిరకం మద్యంతో విసిగిపోయిన మందుబాబుల గొంతులో నాణ్యమైన చుక్క పడనుంది. ఇప్పటికే జగన్ పిచ్చి బ్రాండ్ల తయారీకి అడ్డుకట్ట వేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తమిళనాడు, కర్నాటక,కేరళ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని మద్యం పాలసీపై ఉన్నతా ధికారులతో అధ్యయనం చేయించారు. క్రోడీకరించిన ఈ నివేదికలను వారం కిందట కేబినెట్ సబ్ కమిటీ పరిశీలన చేసింది. మళ్లీ మంగళవారం మరోమారు చర్చించింది. వీరు నివేదిం చిన సిఫారసులపై బుధవారం నిర్వహించే మంత్రి మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. కొత్త మద్యం పాలసీపై చర్చించి నివేదిక సమర్పించనున్నారు. మం త్రి వర్గ ఉప సంఘం గతంలో టీడీపీ ప్రభుత్వంలో మాదిరి పాలసీనే సిఫారసు చేసే అవకాశం కనిపిస్తోంది. అందుబాటు ధరల్లోనే మంచి బ్రాండ్ల ధరలు ఉండనున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగా ప్రైవేటు షాపులు రానున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మద్యం షాపుల స్వరూపం, ధరలు పూర్తిగా మారిపోనున్నాయి.

అందుబాటులోకి నాణ్యమైన కిక్..

వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం ధరలు నిర్ణయించి, ఆ నాయకులు ఆక్రమించుకున్న డిస్టలరీల్లో తయారు చేసిన నాసిరకం మద్యాన్ని ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా విక్రయించారు. బెల్టు షాపులకూ అక్కడి నుంచే సరఫరా జరిగేది. ఈ దాష్టీకానికి తూర్పు గోదావరిలో కనీసం వెయ్యి మంది ప్రాణాలు కోల్పోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మద్యం పాలసీ మార్పును కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొంది.దీంతో ప్రైవేటు షాపులు, పాత మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నాయి. పర్మిట్ రూంలను మంజూరు చేస్తారని సమాచారం. నాణ్యమైన సరుకును అందుబాటు ధరల్లో అందించే క్రమంలోనే సెబ్‌ని రద్దు చేసి అబ్కారీకి మళ్లీ అధికారాలను ప్రభుత్వం ఇచ్చింది. జగన్ జమానాలో ఎక్సయిజ్‌ను నిర్వీర్యం చేయడంతో మద్యాన్ని ఎవరి ఇష్టానుసారం వాళ్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. మళ్లీ టీడీపీ పాలసీ పట్టాలెక్కుతుండడంతో ఐదేళ్ల తర్వాత నాణ్యమైన చుక్క మందుబాబుల గొంతుతడపనుంది.

ప్రైవేటు షాపులకే మొగ్గు..

కూటమి ప్రభుత్వం ప్రైవేటు షాపులకే మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈ నెల 19 లేదా 20న నోటిఫికేషన్ ఇచ్చి 25-27వ తేదీకి ప్రక్రియ పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది. అంతా అనుకు న్నట్టు జరిగితే వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నాణ్యమైన సరుకు అందుబాటు ధరలో మందుబాబులో గొంతులో పడనుంది. ఇప్పటికే గత టీడీపీ ప్రభుత్వంలో ఉన్న ప్రైవేటు షాపులపై ఓ నివేదికను ఎక్సైజు శాఖ పది రోజుల కిందట సమర్పించింది.దీని ప్రకారం అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 165 ప్రైవేటు షాపులు ఉన్నాయి. కానీ జగన్ ప్రభుత్వం తాగుడు తగ్గిస్తామని చెప్పి షాపుల సంఖ్యను విపరీతంగా పెంచింది. ఒక్క తూర్పుగోదావరిలోనే బార్లతో కలిపి 150కిపైగా మద్యం దుకాణాలకు అనుమతిచ్చింది. దరఖాస్తు ఫీజును తెలంగాణ మాదిరిగా రూ.2 లక్షలు నిర్ణయిస్తారని సమాచారం. ప్రభుత్వ ప్రారంభ ధరగా నగర పంచాయతీల్లో రూ.15 లక్షలు, మునిసి పాలిటీలో రూ.35 లక్షలు, నగరపాలక సంస్థ పరిధిలో రూ.50 లక్షలు నిర్ణయించే అవకాశం ఉంది. ఆన్‌లైన్ లాటరీ పద్ధతిలో ప్రైవేటు షాపులు కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. కల్లుగీత కార్మికులకు షాపుల్లో 10 శాతం కేటాయిస్తారని చెబుతున్నారు.

బోరుమంటున్న బార్ల యజమానులు

జగన్ జమానాలో బార్లలో ధరలు భయపెట్టేవి. టీడీపీ హయాంలో ఎంఆర్పీకే బార్లకు సరఫరా చేసి దానిపై వ్యాపారులకు 15-18% కమిషన్ ఇచ్చేవాళ్లు. పెద్ద బార్లలో మినహా ప్రైవేటు షాపుల్లో ఒక్క రూపాయి అదనంగా తీసుకునే వీలుండేది కాదు. కానీ జగన్ మాత్రం బార్లలో ధరలు ఇష్టానుసారం నిర్ణయించుకోవచ్చని ఆదేశాలిచ్చారు. వాళ్లకు ఇచ్చే కమిషన్ ఎత్తేశారు. దీంతో బార్లలో ధరలు బెదర గొట్టేవి.కొత్త మద్యం పాలసీ నేపథ్యంలో తాము నష్టపోతామని ప్రస్తుతం ఇంకా ఏడాది అనుమతులు ఉన్న బార్‌ల యజమానులు గగ్గోలు పెడుతున్నారు.కొంత మంది మూసివేస్తున్నారు. అబ్కారీ కమిషన్‌కు ఇటీవల విజయవాడలో జరిగిన సమా వేశంలో బార్ల యజమానులు కొన్ని విన్నపాలు చేశారు. బార్ల లైసెన్సు వచ్చే ఏడాది సెప్టెంబరు వరకూ ఉంది. కాబట్టి ఇప్పుడు రేట్లు తగ్గించి విక్రయించాలంటే తాము నష్టపోతా మని పేర్కొన్నారు. ప్రైవేటు షాపులు ఇస్తే వాటి మాదిరిగానే తమకు కమిషన్ ఇవ్వడంతో పాటు ఓ ఏడాది పాటు 10% అదనంగా ఇవ్వాలని, కొత్తగా ఇచ్చే ప్రైవేటు షాపులకు పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వొద్దని పేర్కొన్నారు. బార్లకు 100 మీటర్ల దూరంలో ఎలాంటి ప్రైవేటు షాపునకూ అనుమతి ఇవ్వరాదని అభ్యర్థించారు.షాపులను తెరిచి, మూసే సమయాల్లో తమకు ప్రైవేటు షాపులకు వ్యత్యాసం ఉండాలని కోరారు. వీటన్నిపైనా క్యాబినెట్ సబ్ కమిటీ చర్చించింది. ముందు జాగ్రత్తలో భాగంగా ప్రస్తుతం బార్‌లలో ఉన్న స్టాకును విక్రయించడంపై యజమానులు దృష్టి సారించారు. ఎందుకంటే కొత్తగా వచ్చే ప్రైవేటు షాపుల్లో రూ.180కే నాణ్య మైన క్వార్టరు దొరుకుతుంది. ప్రస్తుతం అదే మాదిరి క్వార్ట రుకు ఈ బార్లలో రూ.300 చెల్లించాల్సి వస్తోంది.

క్వార్టరు రూ.180

ఇప్పటికే పలు కంపెనీలతో బ్రాండ్ల ధరల విషయంలో ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. వీటికి లేబుల్ రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉంది. యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్, ఖాసా డిస్టిలరీస్ కంపెనీ, పీరి డిస్టిలరీస్ లిమిటెడ్ కంపెనీలతో 2024-25 ఏడా దికి మద్యం ధరలను అంగీకరిస్తూ గత నెల 29న ఉత్తర్వులు ఇచ్చారు. దీని ప్రకారం.. ప్రీమియం బ్రాండ్ల ధరల్లో పెద్ద మార్పు లేకపోయినా ఎక్కువగా విక్రయం జరిగే మీడియం రేంజ్ బ్రాండ్ల ధరలు ఓ కొలిక్కి వచ్చాయి. జగన్ దెబ్బకు ఎంసీ, సియాగ్రామ్స్ వంటి బ్రాండ్లు రాష్ట్రం నుంచి పారిపో యాయి. ఐదేళ్లూ అందుబాటులో లేవు. కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన బ్రాండ్లు మందుబాబులకు అందుబాటులోకి రానున్నాయి. దీని ప్రకారం.. ఎంసీ లక్సరీ సుప్రీం విస్కీ, మాస్టర్ బ్లెండర్ సిగ్నేచర్ ప్రీమియం అల్ట్రా రిజర్వు విస్కీ రూ.180, రాయల్ ఛాలెంజ్ సెలక్ట్ గోల్డ్ విస్కీ రూ.230, యాంటిక్విటీ బ్లూ అల్ట్రా గోల్డ్ విస్కీ రూ.400, ఆర్‌సీ అమెరికన్ ప్రైమ్ లగ్జరీ గోల్డ్ విస్కీ రూ.310, బ్లాక్ అండ్ అండ్ వైట్ స్కార్ఛ్ రూ.610, స్మిర్నాఫ్ ట్రిపుల్ డిస్టిల్డ్ వోడ్కా రూ.280కే క్వార్టరు ధరగా ప్రభుత్వం ఆయా కంపెనీలో అంగీకారం కుదుర్చుకొంది. మల్టీ నేషనల్ కంపెనీలు తయారు చేసే ఈ బ్రాండ్లు ఐదేళ్ల నుంచీ రాష్ట్రంలో అడుగు పెట్టలేదు. ఎంసీ విస్కీకి ఏ మాత్రమూ సరితూగని లోకల్ బ్రాండ్లను జగన్ రూ.230కి అమ్మించారు. బార్‌లో అయితే రూ.300 కట్టాల్సి వచ్చేది. ఐదేళ్ల పాటు రాష్ట్రంలో కనుమరుగైన నాకవుట్, ఖజురహో, బడ్వయిజర్ తది తర బీర్లు షాపుల్లోకి రానున్నాయి. ఇప్పటికే ఎలిఫెంట్ బీరు అందుబాటులోకి వచ్చిం ది.గత టీడీపీ ప్రభుత్వంలో సారాను నిర్మూలించడానికి చంద్ర బాబు నాణ్యమైన చీప్ లిక్కరును రూ.50కే అందుబాటులోకి తెచ్చారు. తర్వాత దాని ధర రూ.60 అయ్యింది. ఇప్పుడు ఇది రూ.80-100 మధ్య ఉండొచ్చని చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఫలానా పిచ్చి బ్రాండ్లు మాత్ర మే దుకాణాలకు పంపాలంటూ అధికారులపై ఒత్తిడి చేసే విధానాన్ని ఇప్పటికే కూటమి ప్రభుత్వం తీసే సింది. కమిషనరేట్ స్థాయిలో పర్చేజ్ ఆర్డరు ప్రకారం కొనుగోలు చేసి డిపోలకు పంపించే బ్రాండ్లను సమానంగా అన్ని దుకాణాలకు ఇవ్వాలని ఆదేశాలిచ్చింది.

నిడదవోలులో మూడు బార్లకు రెండు మూత



నిడదవోలు, సెప్టెంబరు 17 : మద్యం వ్యాపారం అంటే నష్టాలు వచ్చినట్టు ఎక్కడా లేదు. జగన్ ప్రభుత్వంలో మద్యం వ్యాపారమూ నష్టాలను చవిచూసింది. మూడు గ్లాసులు, ఆరు పెగ్గులుగా కళకళలాడాల్సిన బార్లు మూతపడ్డాయి. నిడదవోలు పట్టణ పరిధిలో 2021-22 సంవత్సరంలో మూడు బార్లకు గత జగన్ ప్రభుత్వం అనుమతు లిచ్చింది. లక్షల రూపాయిలు వెచ్చించి బార్లను వేలంపాటలో పాడుకున్నారు.అయితే బార్లు ప్రారంభం అయ్యాక నాణ్యమైన మద్యం అందుబాటులో లేకపోవడంతో బార్లు నష్టాల బాటలో నడిచాయి. గత తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.150లు విలువ కలిగిన క్వార్టర్ బాటిల్ జగన్ ప్రభుత్వంలో రూ.240లకు ధర పెరగడంతో మందుబాబులు నిరాశ వ్యక్తం చేసేవారు.దీంతో బార్లు పూర్తిగా నష్టాల్లో కూరుకుపోయాయి. ఈ నేపథ్యంలో నిడదవోలు పట్టణంలో ఉన్న మూడు బార్లలోను రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న డీటీఎస్‌వీ బార్, యర్నగూడెం రోడ్డులో ఉన్న ఎస్ఎస్ గ్లాస్‌మెట్స్ బార్లు ఈ నెల ఒకటో తేదీ నుంచి మూసివేశారు. ఒక్కోబార్ సుమారుగా రూ.75 లక్షలకు వేలం పాటలో పాడుకోగా ఇప్పుడు రూ.80 లక్షలకు చేరుకుంది. గత రెండేళ్లుగా నష్టం రావడంతో మూడో ఏడాది భరించలేక బార్ యజమానులు తమ లైసెన్స్‌లను రద్దు చేసుకున్నారు.

వంట నూనెల ధరలు పెరగలేదు

వ్యాపారుల మోసం.. విజిలెన్స్ దాడులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వంటనూనెలపై కస్టమ్స్ సుంకం పెంచే అవకాశం ఉందనే పుకార్లతో ఇటీవల పామాయిల్, సన్‌ఫ్లవర్ ధరలు దారుణంగా పెంచి వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యాపారులు నూనెలపై రూ.20 నుంచి రూ.30 వరకూ పెంచేశారు. సన్ ఫ్లవర్ ప్యాకెట్ రూ.110 నుంచి రూ.115కి అమ్మే వారు. ఇవాళ రూ.135కు అమ్ముతున్నారు. రైస్ బ్రాన్ ఆయిల్ రూ.100 వరకూ ఉండేది.రూ.130కి అమ్ముతున్నారు. పామాయిల్ రూ.110కి అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అక్రమ ధరలపై ఆగ్రహం వ్యక్తం చేసింది.విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాడులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా కాకినాడ జిల్లాలో తనిఖీ లు చేసి 9 కేసులు నమోదు చేశారు.


రైతులకు రుణాలు ఇవ్వండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, సెప్టెంబరు 17 : జిల్లాలో వరదలు, భారీ వర్షాల నేపథ్యంలో రెండు నెలల్లో 279.72 కి.మీ ఆర్అండ్‌బీ రహదారులు, 203.53 కి.మీ పంచాయతీ రాజ్ రహదారులు దెబ్బతిన్నాయని, 94 ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు ముంపుబారిన పడ్డాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవా రం బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. జూలై నెలలో ఎర్రకాలువ గోదావరి వరదలు వచ్చి గోపాలపురం,నిడదవోలు నియోజకవర్గాల్లో 10వేల ఎకరాలు ముంపుబారిన పడ్డాయన్నారు.సెప్టెంబరులో వరదలకు ఎర్ర కాలువ దిగువ ప్రాంతానికి చెందిన 2,446 ఎకరాలు ముంపునకు గురైందన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు బీమా చెల్లింపులు ,తిరిగి రుణాలు మంజూరు విషయంలో బ్యాంకర్ల ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఆర్ఎం విశ్వేశ్వరరావు, డీసీసీ కన్వీనర్ ఎల్‌డీఎం ప్రసాద్, వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత ఇసుక పాలసీ

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17: ఉచిత ఇసుక పాలసీ ఈ నెల 19 నుంచి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో డివిజన్, మండల స్థాయి అధికారులతో ఉచిత ఇసుక పాలసీపై మంగళవారం జేసీ చిన్నరాముడుతో కలిసి దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మెట్రిక్ టన్నుకు రూ.362లుగా నిర్ణయించినట్టు తెలిపారు.ఆన్‌లైన్ ద్వారా మాత్రమే లావాదేవీలు నిర్వహిస్తారు. సమావేశంలో ఇన్‌చార్జి ఆర్‌డీవో కేఎల్.శివజ్యోతి, ఆర్‌వీ.కృష్ణనాయక్, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, ఆర్‌టీవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గోదారిలో.. దాహం..దాహం!



రాజమహేంద్రవరం ప్రధాన మంచినీటి విభాగంలో ప్యూరిఫై కాక ముందు గోదావరిలో వరద నీరు ఇలా..



ప్లాంట్‌లో ప్యూరిఫై చేసిన తరువాత ఇలా..

- రాజమహేంద్రవరంలో తాగునీటి ఎద్దడి
- ప్రధాన మంచినీటి విభాగంలో లోపాలు
- పాత మోటార్లతో కుస్తీ.. మరమ్మతులు
- మరో వైపు సిబ్బంది కొరత
- 4.5 లక్షల మందికి ఒక పూటే సరఫరా
- రెండుపూటలా నీరందించేలా కసరత్తు

గోదావరి చెంతనే ఉన్నా.. రాజమహేంద్రవరం ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.. కళ్లెదుటే లక్షలాది క్యూసెక్కులు వృథాగా పోతున్నా ఒడిసి పట్టుకోలేక పోతున్నారు.. సాధారణ రోజుల్లో కాస్త ఫరవాలేదనిపించినా.. వరదల సమయంలో అయితే చుక్కనీరు రావడం గగనమే.. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఒక పూట మాత్రమే మంచినీటిని సరఫరా చేస్తున్నారు.. అదీ అరగంట మాత్రమే. అసలు ఎందుకిలా అని ఆరాతీస్తే.. అసలు సమస్య బయటపడింది.. గత పాలకుల నిర్లక్ష్యం.. నేడు ప్రజలకు శాపంగా పరిణమించింది.. గొంతులు తడిపేందుకు అడ్డంకిగా మారింది.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సమస్య పరిష్కారానికి పూనుకోవడంతో అసలు విషయం బయటపడింది. నగరంలో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక కథనం.

గోదావరి చెంతనే.. గొంతులు ఎండుతున్నాయ్..

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 17 : అఖండగోదావరి చెంతనే ఉన్నా గొంతులు ఎండుతున్నాయ్.. దశాబ్దాలుగా రాజమహేంద్రవరాన్ని తాగునీటి కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి.ప్రతి ఏటా రాజమహేంద్రవరంలో తాగునీటి ఎద్దడి అధికమవుతూనే ఉంది. సాధారణ రోజుల్లో ఎంతో కొంత నీరందించగలుగుతున్నప్పటికి వరదల సమయంలో తాగునీటి కష్టాలు తప్పడంలేదు. నగరంలో 4.5 లక్షల మంది జనాభా ఉన్నారు. దాదాపు ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయి. అక్కడక్కడా పబ్లిక్ ట్యాప్‌లు ఉన్నాయి. ప్రజలు కార్పొరేషన్ వాటర్‌నే ఎక్కువ వినియోగిస్తారు. కళ్లెదుటే లక్షలాది క్యూసెక్కుల వరద నీరు సముద్రంలోకి పోతూనే ఉంటుంది. అయినా ప్రజల దాహం కేకలు మాత్రం ఆగడంలేదు. గత ఐదేళ్లుగా రాజమహేంద్రవరంలో తాగునీటి సమస్య పెరిగింది.

మరమ్మతులకు గురవుతున్న మోటార్లు..

నీటి శుద్ధి నిరంతరం జరగాలంటే మోటార్లు కండీషన్‌లో ఉండాలి. అయితే ప్రధాన మంచినీటి విభాగంలో మోటార్లు కండీషన్‌లో లేవు. ఐదేళ్లు, పదేళ్ల కిందట కొనుగోలు చేసిన 45 హెచ్‌పీ మోటర్లు రెండు, 50 హెచ్‌పీ మోటార్లు రెండు, 100 హెచ్‌పీ మోటార్లు మూడు, 60 హెచ్‌పీ మోటర్లు రెండు, 75 హెచ్‌పీ మోటారు 1 ఉన్నాయి. ఇవి నిరంతరం పనిచేస్తూనే ఉండడంతో మరమ్మతులకు గురవుతున్నాయి.వాటిని మరమ్మతుల నిమిత్తం ఆయా కంపెనీలకు పంపించి బిల్లు చెల్లించేసరికి పుణ్యకాలం అయిపోతుంది.పాత మోటార్లనే మరమ్మతులు చేయించుకుంటూ కాలంగడుపుతున్నారు. 52 మంది సిబ్బంది అవసరం ఉండగా 28 మంది మాత్రమే పని చేస్తున్నారు. నగరపాలక సంస్థకు వస్తున్న కమిషనర్లు తాగునీటి వ్యవస్థలో లోపాలపై దృష్టిపెట్టడంలేదు.

నేటికీ బ్రిటిష్ కాలం విధానమే..

నేటికీ బ్రిటీష్ కాలం విధానంలోనే ప్రధాన మంచినీటి విభాగంలో నీటిని ప్యూరిఫై చేస్తున్నారు. నూతన టెక్నాలజీ వైపు అడుగులు వేయడంలేదు.దీంతో గోదావరి వరదల సమయంలో నీటి పంపింగ్‌కు పడే బాధలు వర్ణణాతీతం. ప్రధాన మంచినీటి విభాగంలో రావాటర్‌ను లిఫ్ట్ చేశా క క్లారిఫైడ్ బ్రిడ్జిలోకి చేరుస్తారు. అక్కడ బురద ,మట్టి వేరుచేసి అక్కడ నుంచి ఫిల్టర్ బెడ్‌లోకి నీరు చేరుతుంది.ఫిల్టర్ బెడ్‌లో 70-03 ఎంఎం మెత్తని ఇసుక 600 ఎంఎం మందం, 5.3 ఎంఎం గండ్ర ఇసుక 100 ఎంఎం మందం, 12-5 ఎంఎం గులకరాళ్లు 100 మందం, 20-12 ఎంఎం గులకరాళ్లు 100 మందం, 40-20 ఎంఎం గులకరాళ్లు 150 మందం, 60-40 ఎంఎం గులకరాళ్లు 150 మందంలో నీరు ఫిల్టర్ చేస్తారు. ఈ ప్రోసెస్‌లోనే వాటర్‌ను ల్యాబ్‌లో టెస్ట్ చేసి ఆమోదయోగ్యమైన తాగునీటిను బయటకు విడుదల చేస్తారు. ప్రతి 72 గంటలకు 54 ఎంఎల్‌డీ వాటర్‌ను తయారు చేస్తారు. నగరంలో ప్రధాన మంచినీటి విభాగంతో పాటు ఉన్న రెండు 10 ఎంఎల్‌డీ ప్లాంట్ల ద్వారా వచ్చే నీరు కూడా శుద్ధి చేసి సరఫరా చేస్తారు. మొత్తం 74 ఎంఎల్‌డీ వాటర్‌ను నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి విభాగం శుద్ధి చేసి పైప్‌లైన్ల ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులకు సరఫరా చేస్తారు. అక్కడ నుంచి నేరుగా ప్రజలకు సరఫరా అవుతాయి.



మరమ్మతులకు గురవుతున్న మోటార్లు..

రాజమహేంద్రవరంలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన మంచినీటి విభాగాన్ని గత వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. నగరపాలక సంస్థ నిధులను బ్యూటిఫికేషన్ పేరుతో దారిమళ్లించి వృథా చేశారు. తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంవిమర్శలకు దారితీసింది. ప్రధాన మంచినీటి విభాగంలో వాటర్ పంపింగ్‌కు అవసరమైన అత్యాధునిక మోటార్లు కొనుగోలు చేయలేకపోయారు.

పుష్కరం తర్వాత మంచినీటి విభాగంపై దృష్టి

రాజమహేంద్రవరంలో ప్రధాన మంచినీటి విభాగంపై 12 ఏళ్ల తర్వాత ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నేరుగా ప్రధాన మంచినీటి విభాగం సమస్యలను తెలుసుకుని తాగునీరు శుద్ధి చేసే ప్రాంతంలోనే సమీక్షించారు. ప్రధాన మంచినీటి విభాగానికి అవసరమైన మూడు ఎర్టికల్ టర్బెయిన్ మోటార్ల కొనుగోలుకు ప్రతిపాదనలు చేశారు. రూ.75 లక్షలతో ముందుగా ఒక మోటారు చెన్నై నుంచి తీసుకొస్తున్నారు. మిగిలిన రెండు మోటార్లను శాంక్షన్ తీసుకున్నాక తీసుకువస్తారు. ఈ మోటార్లు అమర్చడం ద్వారా నగరంలో తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కరించవచ్చు.రాజమహేంద్రవరం ప్రజలకు రెండుపూటల తాగునీరు సరఫరా చేసేవిధంగా కసరత్తు చేస్తున్నారు.

వర్గీకరణపై తీర్పును పునః సమీక్షించాలి

మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ శ్యామ్



ఏవో జవహర్‌బాజీకి వినతిపత్రం అందజేస్తున్న మాల సంఘాల నాయకులు

కొవ్వూరు, సెప్టెంబరు 17: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారి జీఎస్ఎస్ జవహర్ బాజీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం గ్లోబల్ మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బయ్యే మల్లయ్య సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధంగా ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని, అనేక అంశాలను పరిశీలించాలని సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేశారని, దానిపై తీర్పు వచ్చే వరకు రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణపై వేచి ఉండాలన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ రిక్రూట్‌మెంటు కొనసాగిస్తూ ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు అభిప్రాయాల తీర్పు సూచించిన ఇంపీరికల్ డేటా సర్వే ద్వారా ఎస్సీల్లోని 59 ఉపకులాలను గుర్తించి, కులగణన చేసి ఆయా కులాలకు సంబంధించి విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనుకబాటుతనాన్ని శాస్త్రీయమైన సర్వే ద్వారా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మాసీ ఆనంద్, బయ్యే మల్లయ్య, మానుకొండ సూరిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

తాళ్లపూడి, సెప్టెంబరు 17: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు తాళ్లపూడిలో ఏర్పాట్లు పూర్తయ్యాయని తహశీల్దార్ రవీంద్రనాథ్ మంగళవారం తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్లోని మొదటి గదిని పోలింగ్ కేంద్రంగా తీసుకున్నామని, మొత్తం 41 మంది టీచర్ ఓటర్లుగా నమోదయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కృషి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 17: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని, దానిని విధ్వంసం చేయాలని అనుకోవడంలేదని, దీనిపై ఇప్పటికే కేంద్ర మంత్రి కుమారస్వామి దృష్టికి తీసుకెళ్లామని, దానిపై ఆయనకు సంపూర్ణమైన అవగాహన ఉందని బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని, లాభాల్లోకి తీసుకురావాలనే ఆలోచనే కాని ఏనాడూ ధ్వంసం చేయాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని అన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

» జాతీయ నులిపురుగుల నివారణ దినంలో కలెక్టర్ ప్రశాంతి

» విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ

చాగల్లు, సెప్టెంబరు 17: విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌ను ఆమె సందర్శించారు. నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు ఆమె వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాత్రలు వేసుకుంటే సరిపోదని, భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడగాలన్నారు. ఆకు, కాయగూరలు పాలు, పండ్లు వంటి పోష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. పిల్లలను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ పీవో మమ్మీ, సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపీడీవో నిర్మలకుమారి, ఎంఈవో యు.గురునాథం, హెచ్ఎం పి.వీర్రాజు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం, దేవరపల్లి, యాదవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను వైద్యసిబ్బంది అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ హరిచంద్రప్రసాద్, శ్రీకృష్ణుడు, పద్మకుమారి, సంజీవ్, నాగేశ్వరరావు, నాగరాజు, జయశ్రీ, ఆశావర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో



నిడదవోలులో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ సుజాత



పెరవలిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న



చాగల్లు హైస్కూల్లో విద్యార్థినికి ఆల్బెండాజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

ప్రిన్సిపాల్ బి.మేరీ సుజాత పర్యవేక్షణలో 428 మంది విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1 నుంచి తొమ్మిదేళ్లలోపు పిల్లలకు కడుపులో నులిపురుగుల కారణంగా రక్తహీనత, ఆకలి మందగించడం, వికారం, వాంతులు, విరేచనాలు మొదలగు సమస్యల వస్తాయని చెప్పారు. దీని నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలువేసుకోవడంతోపాటు వ్యక్తిగతంగా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయరాదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.హరీష్, ఎన్ఎస్ఎస్ పీవో బి.ఏసురత్నం, లైబ్రేరియన్ జి.రామమోహనరావు, అధ్యాపకులు, విద్యార్థులు, రామ్‌నగర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: కానూరు, పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఖండవల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పెరవలిలో సర్పంచ్ సీతమ్మ, తీపర్రులో జనసేన నాయకుడు పత్తిపాటి ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



కొవ్వూరులో మునిసిపల్ ఉద్యోగుల మానవహారం

» కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

» పలుచోట్ల స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

కొవ్వూరు, సెప్టెంబరు 17: ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. మంగళవారం కొవ్వూరు మున్సిపాల్టీ ఆధ్వర్యంలో స్థానిక విజయవిహార్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, నినాదాలు చేశారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని చేపట్టామని, పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణకు వచ్చిన సిబ్బందికి చెత్త అందించాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి క్లీన్ కొవ్వూరుగా పట్టణాన్ని తీర్చిదిద్దాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి.రాధాకృష్ణ, ఉద్యోగులు, పారిశుధ్య మేస్త్రీలు, సచివాలయ కార్యదర్శులు, మెప్మా, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఆర్టీసీ బస్టాండ్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొవ్వూరు డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్ అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ మెయిన్ గేటు వద్ద మంగళవారం గేటు మీటింగ్ నిర్వహించారు. ఏపీఎస్ ఆర్టీసీ స్వచ్ఛత సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ ట్రాఫిక్, గ్యారేజ్ మెకానికల్ సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఆర్టీసీలోని అన్నిశాఖల సిబ్బంది తమ విభాగాలను, బస్సులను, బస్‌స్టేషన్లను పరిశుభ్రం చేసుకోవాలని డీఎం కుమార్ అన్నారు.

చాగల్లు: చాగల్లులో మెయిన్ రోడ్డులో మూర్తి కాంప్లెక్ నుంచి సెంటర్ వరకు స్వచ్ఛతా హీ సేవా అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై నినాదాలు చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చీపురులు చేతపట్టుకుని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త, మురుగు పేరుకు పోయి దోమలు చేరి అనేక రకాల వ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు.కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, ఈవోపీఆర్డీ శ్రవణ్‌కుమార్, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్, దొంగ రామకృష్ణ, ఆళ్ల సత్యనారాయణ, మిరియాల సతీష్, హెచ్ఎం పి.వీర్రాజు, ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో బస్టాండ్ వద్ద అధికారులు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో పి.ప్రభాకర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే తినాలని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, కడిమి అప్పారావు, పచ్చా రామ్‌గోపాల్, కడిమి రాజు, ఖైరం అప్పారావు, పట్టా రామ్‌గోపాల్, ఉప్పులూరి రాంబాబు, కార్యదర్శి రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలో పంచాయతీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి బస్టాండు సెంటరులో మానవహారం చేపట్టారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీబీ వెంకటరమణ, కార్యదర్శి ఆశాఅలేఖ్య, ఉప సర్పంచ్ అప్పన జగదీష్, ఏపీఎం రోజ్ మాణిక్యం, హెచ్ఎం సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల: కవులూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో సింహాద్రి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చేందుకు పక్షం రోజుల పాటు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వాటిలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములుగా ర్యాలీలు, సదస్సులు నిర్వహించాలన్నారు. బడులు, బ్యాంకులు, ప్రభుత్వ సంస్థల్లో, బహిరంగ ప్రదేశాల్లో శుభ్రత ఉండే విధంగా సేవ కార్యక్రమాలు చేయాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి రమేష్ ఉన్నారు.



చాగల్లులో చీపుళ్లతో రోడ్డు శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



దేవరపల్లిలో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పెరవలిలో రక్తదానం చేస్తున్న జనసేన కార్యకర్తలు

ఘనంగా మంత్రి దుర్గేష్ జన్మదినం

పెరవలి, సెప్టెంబరు 17: రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెరవలి దీపికా కల్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్ఐ పి.అప్పారావు ప్రారంభించగా పలువురు పార్టీ కార్యకర్తలు రక్తదానం చేశారు. మండలాధ్యక్షుడు పిప్పర రవి, తులా చినబాబు, పాలా వీరాస్వామి, పి.నాగరాజు, నందిప చక్రవర్తి, పొప్పుప్పు సూర్యనాగేశ్వరరావు, దేవరపు ఏడుకొండలు, కోటిపల్లి మురళీకృష్ణ, ప్రత్తిపాటి ప్రసాద్‌కుమార్, అతికాల శ్రీను పాల్గొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు జనసేన కార్యకర్తల ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పిప్పర రవి, వీరవల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

నిడదవోలు, సెప్టెంబరు 17: సమాజంలో విశ్వ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో ఐక్యంగా ఉంటూ అభివృద్ధి చెందాలని కామాక్షి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు గోలి రామబ్రహ్మం, నాగోజు వీరసత్యనారాయణ అన్నారు. మంగళవారం నిడదవోలులోని కామాక్షి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రెజరర్ లావేటి జేజి శివనారాయణ, కొమ్మోజు చంద్రశేఖర్, పొడుగు నరేష్, వెంకటేశ్వరరావు, కె.శ్రీను తదితర్లు పాల్గొన్నారు.

గణపతికి 108 రకాల వంటకాలతో నైవేద్యం



కొవ్వూరు మెరకవీధిలో గణపతికి 108 రకాల పిండి వంటలతో నైవేద్యం

కొవ్వూరు, సెప్టెంబరు 17: కొవ్వూరులోని 23వ వార్డు, మెరకవీధి వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటుచేసిన వినాయకుడికి భక్తులు మంగళవారం 108 రకాల స్వీట్సు, పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. లక్ష్మీ గణపతి ఉత్సవాలు 11వ రోజు ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు 108 రకాల స్వీట్స్, పిండి వంటలను తీసుకువచ్చి నైవేద్యంగా సమర్పించారు. ఈ నెల 23న స్వామి వారి లడ్డూ ప్రసాదం వేలం, అన్నదానం, గణపతి శోభాయాత్ర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వినాయకుడి నిమజ్జనం

తాళ్లపూడి, సెప్టెంబరు 17: అన్నదేవరపేటలో శ్రీ లక్ష్మీగణపతికి ఉత్సవ కమిటీ, యువగళం ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మేళ తాళాలు, బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భక్తులు, యువగళం టీం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



దేవరపల్లి: దేవరపల్లిలో జరిగిన వినాయకుడి ఊరేగింపును గోపాలపురం మాజీ సర్పంచ్ సుంకర యామిని, సుంకర దుర్గారావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు ప్రారంభించారు. బాణసంచా కాల్పులు, బ్యాండు వాయిద్యాలతో, విచిత్రవేషధారణలతో పురవీధుల్లో ఊరేగించి సాయంత్రం నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చప్పటి శివనాగప్రసాద్, కడిమి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం

తాళ్లపూడి, సెప్టెంబరు 17: విద్యార్థి వైద్యానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పెద్దేవం గ్రామంలో జడ్పీ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న బట్టు రాజ్‌వర్ధన్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. అతడికి వైద్య ఖర్చుల నిమిత్తం దాతల సహకారంతో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులు రూ.29 వేలు అందించారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి అబేద్నిగో, కిషోర్, దమయంతి, నిఖిత పాల్గొన్నారు.

చెట్టు కింద సేద తీరుతుంటే.. వెంటాడిన మృత్యువు..



అప్పారావు

దేవరపల్లి, సెప్టెంబరు 17: దేవరపల్లి మండలం గౌరీపట్నం మేరీమాత గుడి సమీపంలో లారీ ఢీకొని క్వారీ కార్మికుడు మృతిచెందాడు. గౌరీపట్నం గ్రామానికి చెందిన తళ్లే అప్పారావు (45) స్థానికంగా క్వారీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. దేవరపల్లి వైపు నుంచి కొవ్వూరు వెళ్తున్న లారీ మేరిమాత గుడి ఎక్కే క్రమంలో గేర్ న్యూట్రల్ అవడంతో రివర్స్‌లో వెళ్లి క్వారీ పని ముగించుకుని చెట్టు కింద సేదదీరుతున్న అప్పారావును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కాగా అప్పారావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

కొవ్వూరు, సెప్టెంబరు 17: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరులోని 23వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో కేక్ కట్‌చేసి పార్టీ నాయకుడు గంగ్రోతు పవన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వాత్సల్యా వృద్ధాశ్రమంలో మడిచర్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మదర్ థెరిస్సా హోంలో విద్యార్థులకు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ బిస్కెట్‌లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, ఎం.రామచంద్రరావు, గెల్లా కేశవ, నీరుకొండ సూర్యనారాయణ, ఎం.వీరాంజనేయులు, సాయిరాజు, రామకృష్ణ, భాస్కర్, శ్రీహరి పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులో మోదీ జన్మదినాన్ని బీజేపీ నాయకులు నిర్వహించారు. నెలటూరులో ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి కేక్ కటింగ్ చేశారు. స్వీట్లు పంచారు. నెలటూరు, చాగల్లు ఇందిరమ్మ కాలనీ, మల్లవరం ఎంపీపీ స్కూళ్లలో పిల్లలకు స్వీట్లు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్య క్రమంలో మద్దిపాటి సురేష్, తాళ్ళూరి వరప్రసాద్, జుట్ట గణపతి, కండిబో యిన సూర్యప్రకాశరావు, సుంకవల్లి సుబ్బారావు, కాంచన సౌందర్య, శీల బోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి బస్టాండు సెంటరులో బీజేపీ మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ ఆధ్వర్యంలో కేకును కట్ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ అధ్యక్షుడు కలిశెట్టి సన్యాసినాయుడు, కిల్లాని వెంకటరమణ, తిరుమలశెట్టి కృష్ణ, మల్లిమొగ్గల సత్యనారాయణ పాల్గొన్నారు.



తాళ్లపూడిలో మోదీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

నిడదవోలు: నిడదవోలులో బీజేపీ నాయకులు కేక్ కటింగ్ నిర్వహించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మోదీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పట్టణంలోని వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో రంగా వెంకటేశ్వరరావు, నీలం రామారావు, బాబీ, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ విస్తీర్ణం పెంచాలి

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

» నల్లజర్ల మండల సర్వసభ్య సమావేశం

నల్లజర్ల, సెప్టెంబరు 17: అతిగా ఎరువులు, పురుగుల మందులు వినియోగించడం ద్వారా భూమి రసాయన ఎరువులతో నిండిపోయిందని, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ సంయుక్తంగా రైతులను సేంద్రియ వ్యవసాయం చేసే విధంగా అవగాహన కల్పించి ప్రతి ఏటా సేంద్రియ వ్యవసాయ విస్తీర్ణం పెంచే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బంకా జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలను పండించాలన్నారు. రైతులకు కావలసిన వర్మీ కంపోస్టు ఎరువుల తయారికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. రైతులకు పెట్టుబడుల ఖర్చు తగ్గించి అధిక ఆదాయం వచ్చే విధానాలను, సరికొత్త పంటలు పండించే విధంగా రైతులకు అవగాహన కలిగించాలన్నారు. ప్రతి నెల రైతు సదస్సులను ఏర్పాటు చేసి అన్ని రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తలను ఏర్పాటు చేస్తామన్నారు. నబీపేట సర్పంచ్ సత్యలక్ష్మి మాట్లాడుతూ పంచాయతీకి 15 విద్యుత్ స్తంభాలు కావాలని కోరి మూడేళ్లవుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మూడు వారాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రకాశరావుపాలెం సర్పంచ్ జార్జీ విక్టర్ మాట్లాడుతూ ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలు పడి ప్రయాణికులకు తీవ్ర గాయాలైనా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని, అసలు సర్వసభ్య సమావేశానికే రావడం లేదన్నారు. దసరా నుంచి సంక్రాంతి వరకు స్కూల్ విద్యార్థులకు క్రీడాలు నిర్వహించాలని, అందుకు క్రీడా సామగ్రి మొత్తం తాను భరిస్తానన్నారు. ఈ ఏడాది సంక్రాంతి క్రీడాలు ఎన్నాడు జరుగని విధంగా జరుపుకోవాలన్నారు. గ్రామంలో యువకులకు, స్కూల్ విద్యార్థులకు వేరు వేరుగా క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఉపాధి కూలీలను పెంచే విధంగా జాబ్ కార్డులు అర్హులందరికీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణారావు, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, ఎంపీడీవో సింహాద్రి, సర్పంచ్‌లు పిచ్చుకల గణపతి, పల్లి జ్యోతి, బండి నాగరాజు పాల్గొన్నారు.

యర్నగూడెంలో ఉచిత మెగా వైద్య శిబిరం



దేవరపల్లి, సెప్టెంబరు 17: యర్నగూడెంలో ఆర్.కన్వెక్షన్ హాలు వద్ద నిర్వహిస్తున్న మెగా ఉచిత వైద్యశిబిరం రెండో రోజు మంగళవారం టీడీపీ నాయకుడు పెనుమత్స సుబ్బరాజు ఆధ్వర్యంలో కొనసాగింది. శిబిరంలో వెయ్యి మంది రోగు లకు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు వంద మంది యువత రక్తదానం చేశారు. రాజమహేంద్రవరం జీఎస్ ఎల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు రోగులకు వైద్యపరీక్షలు చేశారు. గ్రామీణ ప్రాం తంలో పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సొంత నిధులతో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్టు సుబ్బరాజు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దే శ్రీనివాసు, బళ్లా సూర్యచక్రం, బొల్లిన భాస్కర్, మండా సుబ్బా రావు, ప్రత్తిపాటి హరినాద్, శ్రీకాకుళం కాశీవిశ్వనాధం, బలుసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

కొవ్వూరు, సెప్టెంబరు 17: ప్రభుత్వం నుంచి స్థలం పొందిన ప్రతి లబ్ధిదారుడు త్వరగా ఇంటి నిర్మాణం చేపట్టి పూర్తిచేయాలని కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆరికిరేవుల రోడ్‌లోని జగనన్న కాలనీ లేఅవుట్-2లో శుక్రవారం గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించారు. లేఅవుట్-2లో 850 మంది లబ్ధిదారులకు గాను 300 మంది గృహ నిర్మాణాలు పూర్తి చేశారు. వాటిలో శుక్రవారం 5 గృహాలకు ప్రవేశాలు చేశారు. దీనికి రత్నకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో నిర్మాణం చేపట్టిన ఇళ్లకు గృహప్రవేశాలు నిర్వహించారు. 100శాతం నిర్మాణం పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, హౌసింగ్ డీఈ ఎం.శ్రీనివాసరావు, కొవ్వూరు, తాళ్లపూడి ఏఈలు డీఎస్ చాంబర్లిన్, పి.సుబ్బరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఎమినిటీ సెక్రటరీ మెప్మా సిబ్బంది, లబ్దిదారులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరులో ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా మంజూరైన ఇళ్లకు గృహప్రవేశాలను సర్పంచ్, టీడీపీ నాయకులు అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా నాగమణి, నాయకులు ముళ్ళపూడి దొరాజీ, కరుటూరి శ్రీరామమూర్తి, ముళ్ళపూడి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉసులుమర్రులో ఉచిత దంత వైద్యశిబిరం

ప్రారంభించిన ఎమ్మెల్సీ వంక రవీంద్ర



ఉచిత దంత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్ర

పెరవలి, సెప్టెంబరు 17: ఉసులుమర్రులో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఎమ్మెల్సీ వంక రవీంద్ర విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 150 మందికి పరీక్షలు చేశారు. అలాగే ఎమ్మెల్సీ దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లేకపోవడాన్ని ఆరా తీశారు. ఉపాధ్యాయుల స్కూలు కాంప్లెక్స్ సమావేశానికి హెచ్ఎం వెళ్లారని చెప్పారు. స్కూలు కాంప్లెక్స్ సమావేశానికి వెళ్లడం వల్ల పాఠశాల విద్యకు ఆటంకం కలుగుతుందని అందువల్ల ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే గ్రామంలో జరిగిన మంత్రి దుర్గేష్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీ రవీంద్ర పాల్గొన్నారు. జనసేన కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. తాము పార్టీలు వేరైనప్పటికీ దుర్గేష్ నాకు మంచి మిత్రుడని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఉప్పలపాటి సత్తిరాజు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కోలా సీతారాముడు, సలాది భాస్కరరావు, పడాల శ్రీనివాస్, ప్రకాష్‌రావు, కె.వీర్రాజు పాల్గొన్నారు.

హైవే దాటిన చిరుతపులి



దివాన్‌చెరువు, సెప్టెంబరు17: దివాన్ చెరువు అటవీ ప్రాంతం మధ్యనుంచి వెళుచున్న జాతీయరహదారిని చిరుతపులి సోమవారం రాత్రి సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో పుష్కరవనం వైపు నుంచి రిజర్వ్ ఫారెస్టు వైపు రోడ్డు దాటుతుండగా హైవేపై వెళ్లే వారు గమనించారని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లాలాచెరువు నుంచి ఆటోనగర్ హైవే పై ఇరువైపులా ప్రయాణించే వాహనదారులు గమనిస్తూ ప్రయాణించాలని కోరారు. సీసీ, ట్రాప్ కెమెరాలలో మంగళవారం చిరుతపులి కదలికలు కనిపించలేదన్నారు. చిరుతపులిని పట్టుకొనుటకు అదనపు బోనులను అమర్చి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. నివాస ప్రాంతాలలో చిరుతపులి సంచరిస్తున్నట్లు నిర్ధారణ కాలేదన్నారు. అలాగే ప్రస్తుతం మూసి ఉన్న పుష్కరవనాన్ని చిరుత సంచారం నేపథ్యంలో మరి కొన్ని రోజులు మూసి ఉంచనున్నట్టు తెలిపారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్

నిడదవోలు

వీ మ్యాక్స్	సరిపోదా శనివారం
రాధాకృష్ణ	ది గోట్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు

దేవరపల్లి

శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్